విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

సోమవారం 28 ఏప్రిల్ 2025 8 పేజీలు

ప్రజాదోపిడీపై పోరాటాలు

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విస్సన్నపేట : పాలకులు చేస్తున్న ప్రజాసొమ్ముల దోపిడీని అడ్డుకునే దిశగా పోరాటాలు చేయటం ద్వారానే పార్టీ పటిష్ఠత, ప్రజల నుంచి మన్ననలు పొందగలమని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. విస్సన్నపేటలో ఆదివారం జరిగిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పాలనలో అధికారపార్టీ దోపిడీ పెచ్చరిల్లటంతో -మిగతా 2 లో ...

పాడి రైతుకు మేలు చేయండి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-తుళ్లూరు : అమరావతి రాజధాని పనులు వేగంగా నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో పాడి రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉండాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. శనివారం ప్రపంచ వెటర్నరీ డే సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం పశువైద్య సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. రైతులకు సబ్సిడీ ధరలకు పాలు పితికే యంత్రాలు, దానా కట్టలు ఇవ్వాలని ఆయన కోరారు.

పహల్గాం ఘటన దారుణం

మేడే కార్యక్రమాలు జయప్రదం చేయాలి : నార్ల వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-గుడివాడ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గం లో అమాయకులైన టూరిస్టులపై ఉగ్రవాద దాడి చేసి 27 మందిని చంపడం దారుణమని సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి కామ్రేడ్ నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో నియోజక వర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనను రాజకీయంగా కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని చూస్తుందని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో జరిగిన కుంభకోణాలు బయటకు వస్తున్నాయన్నారు. ఇప్పటివరకు పాలన చేసిన అన్ని రాజకీయ పార్టీలు పేదల శ్రమ దోపిడీని ఆపలేక పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో మహిళలందరికీ ఆర్టీసీ బస్సు ఉచితం, తల్లి వందనం ఇంతవరకు అమలు చేయలేదని -మిగతా 2 లో ...

చల్లపల్లిలో ఉగ్రదాడికి నిరసన

విశాలాంధ్ర-చల్లపల్లి : పెహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ చల్లపల్లిలో అఖిలపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రధాన సెంటర్లో జరిగిన కార్యక్రమంలో మృతిచెందిన పర్యాటకులకు నివాళులు అర్పించారు. కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తంచేశారు. పర్యాటకుల మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నేత దాసి సీతారామరాజుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ -మిగతా 2 లో ...

చంద్ర రాజేశ్వరరావు నగర్‌కు మెయిన్ రోడ్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నగర్‌కు మెయిన్ రోడ్ ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. చంద్ర రాజేశ్వరరావు నగర్ డివిజన్ కార్యదర్శుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు నగర్ మెయిన్ రోడ్డుకు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ శంకుస్థాపన చేయడం జరిగిందని, కానీ రోడ్డు పనులు ప్రారంభించలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు పట్టించుకోని కారణంగా మెయిన్ రోడ్డు అధ్వాన్నంగా తయారైందని చెప్పారు. అక్కడ నివాసాలు ఉంటున్న ప్రజల ఇబ్బందులను -మిగతా 2 లో ...

పేరు గొప్ప... ఊరు దిబ్బ...!

పదిలో నూరు శాతం ఫలితాలు కరువాయే ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్య డొల్లతనం

> ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చిన విషయం విదితమే. అందులో దాచేపల్లి నగర పంచాయతీ సహా గ్రామీణ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 19 ఉన్నాయి. వాటిలో 11 ప్రభుత్వ పాఠశాలలే. వాటిలో ఫలితాలు తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా లేవంటే అతిశయోక్తి కాదేమో.. నూరు శాతం ఫలితాలు కరువయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలపై ఆ ఫలితాలు నీళ్లు చల్లాయి.

విశాలాంధ్ర-దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్య డొల్లతనమైందని మరో మారు ఈ ఫలితాలు నిరూపించాయి. జ్యోతీరావు పూలే బీసీ బాలుర పాఠశాల మినహా మిగతా ఎందులోను నూరు శాతం ఫలితాలు రాలేదు. అందులో రాసిన 25 విద్యార్థులు మంది ఉత్తీర్ణులయ్యారు. ముత్యాలం పాడు ఉన్నత పాకశాలలో మాత్రం 21 మందికి ఒక విద్యార్థి తప్పాడు. మిగతా అన్ని పాఠశాలల్లో ఫలితాలు తల్లిదండ్రులతో పాటు మండలం లోని ప్రజలను నిరుత్సాహపర్చాయి. దాచేపల్లి ఉన్నత పాఠశాలలో 214 మంది రాయగా 151 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగతా 63 మంది ఫెయిలయ్యారు. ఆదర్శ పాఠశాలలో 84 మందికి 71 మంది ఉత్తీర్ణులు కాగా 13 మంది తప్పారు. తంగెడ ఉన్నత పాఠశాలలో 63 కు 44, పెదగార్లపాడు ఉన్నత పాఠశాలలో 48 కి 37, కేజీబీవీలో 35 కు 25, గామాలపాడు ఉన్నత పాఠశాలలో 25 కు 20, మాదినపాడు ఉన్నత పాఠశాలలో 24 కు 10, రామాపురం ఉన్నత పాఠశాలలో 19 కి 9, కేసానపల్లి ఉన్నత పాఠశాలలో 18 కి 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అన్ని చోట్ల 155 మంది ఫెయిలయ్యారు. కారణాలేమైనప్పటికీ ఫలితాలు అందరినీ ఆశ్చర్యపర్చాయి. ఇందులో సబ్జక్టు వారీగా చూసుకుంటే ఆయా సబ్జక్టుల్లో ఫెయిలైన విద్యార్థుల ప్రభావం వాటిని బోధించిన ఉపాధ్యాయుల (బోధన) పనితీరును ప్రశ్నించడంతో పాటు విమర్శలకు తావిస్తోంది. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి సన్నగిల్లిందనే సాకు ఉపాధ్యాయులు చెప్తున్నప్పటికీ అది సహేతుకం కాదనేది వాస్తవమని వారికి కూడా తెలుసు. కొంతమంది -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాదోపిడీపై పోరాటాలు

ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, కానీ నేడు అధికారపార్టీ సైతం ఇదే దిశగా పయనిస్తోందన్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ జిల్లాలో ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీ దందా రాజ్యమేలుతోందన్నారు. తాను ఈ విషయమై ప్రశ్నించటంతో అధికారులు కొంతవరకు అడ్డుకట్ట వేయగలిగారన్నారు. విస్సన్నపేట మండలంలో సైతం మట్టి, గ్రావెల్ మాఫియా రాజ్యమేలుతోందని వీటిని ప్రశ్నించి, ప్రజా ఉద్యమాలు నిర్మించే దిశగా స్థానిక నాయకత్వం పనిచేయాలని సూచించారు. పరిస్థితి మారకుంటే స్వయంగా తానే ఇక్కడికి వచ్చి క్షేత్రస్థాయిలో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సీనియర్ నాయకుడు పంతంగి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యుడు రాయప్ప, మరో కార్యవర్గసభ్యుడు, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తూము కృష్ణయ్య, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకూరి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు, రైతుసంఘం నాయకుడు వేగి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాసరావు, మండల నాయకులు పితాని నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు, వంట ఏజన్సీల సంఘం నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మే 11వ తేదీన మండల మహాసభ ఏర్పాటు చేయాలని, విస్సన్నపేటలో శాశ్వత స్థాయిలో సీపీఐ కార్యాలయ నిర్మాణం దిశగా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

పహల్గాం ఘటన దారుణం

ఆరోపించారు. మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, మే నెలలో శాఖ, నియోజకవర్గ మహాసభలు జరపాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, గుడివాడ సహాయ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఉగ్రదాడికి నిరసన

పైడిపాముల స్వప్న, వివిధ పార్టీల నాయకులు షేక్ నబీఘోరీ, మీర్ రిజ్వాన్, బోలెం నాగమణి, వాకా రామచంద్రరావు, షేక్ నసీంఘోరీ, వెనిగళ్ల వసంతరావు, నర్రా చిన్ని, బత్తుల ప్రసాద్, ఉప్పల సాంబశివరావు, బి.కనకదుర్గ, తుతూరు ప్రసాద్, రావి రాజేశ్వరరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, కొల్లూరి శ్రీధర్, సిద్ధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు నగర్‌కు మెయిన్ రోడ్ ఏర్పాటు చేయండి

నూతనంగా ఏర్పడిన టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు బాధ్యత తీసుకుని మెయిన్ రోడ్డు, అడ్డరోడ్లు, సైడ్ కాలువలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సీఆర్ నగర్‌కు పట్టాలు ఇచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే సీపీఐ పోరాట ఫలితంగా విద్యుత్, రోడ్లు, కాలువలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోగలిగామని, అలాగే పల్స్ సర్వే నిర్వహించారని, ఓట్లు సాధించుకోగలిగామని చెప్పారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా సుమారు 3000 మరుగుదొడ్లు నిర్మించుకోగలిగామని వెల్లడించారు. నగరపాలక సంస్థ వైసీపీ పాలక వర్గం సీఆర్ నగర్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని, ఇప్పటికైనా శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, నగరపాలక సంస్థ అధికారులు సీఆర్ నగర్ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు దేవానాయక్, శ్రీను, నక్షత్ర, మౌలాలి, శివమ్మ, మస్తాన్ బి తదితరులు పాల్గొన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ..!

ఉపాధ్యాయులు ఆయారాం గాయారాం తరహాలో గుంటూరు తదితర ప్రాంతాల నుంచి రైళ్ళకు రావడం, పోవడం జరుగుతోంది. దీన్నుంచి ఆలస్యంగా రావడంతో పాటు ముందుగా వెళ్తున్నారనే ఆరోపణలు ఆది నుంచి ఉన్నాయి. మధ్యాహ్నం పూట భోజనం చేసిన తర్వాత రైల్వే స్టేషన్ కు వెళ్ళాలని పలువురు పడే ఆదుర్దా గురించి బహిరంగ రహస్యమే. సోషల్ మీడియాలో కనిపించడం సహా ఇతర వ్యాపకాల పట్ల చూపిస్తున్న శ్రద్ధ మరీ తీవ్రమైందనే ఆరోపణలు ప్రజానీకం నుంచి గట్టిగా వినపడుతోంది. ఈ విధంగా ప్రజలు, తల్లిదండ్రుల నుంచి వస్తున్న విమర్శలు, ఆరోపణల గురించి చెప్పుకుంటూ పోతే ఇంకా కోకొల్లలుగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా బాగా కొరవడింది. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు గురించి ఆరా తీయడం, విచారించడం మర్చిపోయారు. అందరినీ నిరాశపర్చిన ఫలితాల పట్ల ఆత్మ విమర్శ చేసుకోవాలని బాధ్యతాయుతమైన ఉపాధ్యాయులను మండలంలోని ప్రజలు కోరుతున్నారు. ఈ ఫలితాలు పునరావృతం కాకుండా వచ్చే ఏడాది వంద శాతం ఫలితాలు తీసుకురావాలని, తీసుకువస్తారని ఆశిద్దాం..!!

పహల్గాంలో ఉగ్రవాద పిరికిపంద చర్య

విశాలాంధ్ర-విజయవాడ: భారత ప్రజాస్వామ్యం పైనే దాడిగా భావిస్తూ ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని అఖిల భారత యువజన సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవింద రాజులు అన్నారు.ఆదివారం సాయంత్రం హనుమాన్ పేట లో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఉగ్ర దాడికి నిరసనగా కవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు హిందువునే లక్ష్యంగా చేసుకొని అత్యాధునిక ఆయుధాలతో వేటాడి వెంటాడి చంపడం చాలా దుర్మార్గమన్నారు.భార్య పిల్లల ముందే తమ కుటుంబీకులను చంపడంతో తీవ్ర భయంతో పరుగులు తీసిన వారిని చూస్తుంటే చాలా బాధేస్తుందన్నారు.గతంలో కూడా ఉగ్రవాద ముష్కరులు బహిరంగ ప్రదేశాల్లో బాంబులు పేల్చి అనేకమందిని పొట్టన పెట్టుకోవడం జరిగిందని ఈ ఉన్మాదుల ఆటలు కట్టించకపోతే మరిన్ని ప్రాణాలు గాల్లో కలిసి పోతాయన్నారు. మూడంచల భద్రత కలిగినటువంటి జమ్మూ కాశ్మీర్ లోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారు సమగ్రమైన విచారణ చేపట్టి సహకరించిన వారిని వదిలిపెట్టరాదన్నారు. పహల్గాం మృతుల్లో ఏపీకి చెందిన వారు ఉండడం మరింత బాధకరమన్నారు. ఈ దాడిని దుర్మార్గపు చర్యగా భారత ప్రజలు భావిస్తుంటే ఏకంగా ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్ కార్యాలయంలోకి కేక్ తీసుకు వెళుతుంటే భద్రతా సిబ్బంది ఏమి చేస్తోందని ప్రశ్నించారు. పర్యాటకుల మత విశ్వాసాలని ఉగ్రవాదులు తెలుసుకొని పాశవికంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, శిరం రవికుమార్, సహాయ కార్యదర్శులు ఎస్ లాల్ మోహన్, ఐ ఆంజనేయులు, నాయకులు రామకృష్ణ, గంట మమత, నరేష్, స్వప్న, కళ్యాణ్, నాగ పార్వతి, శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కార్తీక్, ప్రజానాట్యమండలి నాయకుడు ఎస్ కే భాష తదితరులు పాల్గొన్నారు.

కలిసి పనిచేస్తాను

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విశాలాంధ్ర-గుడివాడ : ప్రజలకు సహచరుడిగా, జవాబుదారీగా తాను వచ్చాననీ, గుడివాడ అభివృద్ధికి వారితో కలిసి పనిచేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. 'మీకోసం మీ వెనిగండ్ల' ఉదయపు పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక ఏడో వార్డులో ఆయన పర్యటించారు. వార్డులోని కొత్తపేట పరిసర ప్రాంతాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఎమ్మెల్యే రాము స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు తెలపడంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుడివాడ అభివృద్ధిలో ప్రజలందరూ కూడా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము కోరారు. ఈ కార్యక్రమంలో ఏడో వార్డు కూటమి పార్టీల నాయకులు కుసుకు మోహన్, ఏడుకొండలు, పెద్ది కిషోర్, మంగరాజు, స్థానిక ప్రజలు, యువత పాల్గొన్నారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన బీసీ సంఘ నాయకులు టిడిపి నేత దారం నరసింహారావు కుటుంబ సభ్యులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని దారం ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముందుగా స్వర్గీయ దారం నరసింహారావు చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే రాము నివాళులు అర్పించారు. దారం నరసింహారావు కుటుంబానికి గుడివాడ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందంటూ ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దారం కుటుంబ సభ్యులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకిన దొంగ

పట్టుకుని ఆసుపత్రికి తరలింపు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: రాష్ట్రంలోని వివిధ ప్రాంతంలో భారీ చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగను విజయవాడ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన రాయుడు దుర్గారావు (50) ఆరేళ్లుగా వివిధ ప్రాంతాల్లో భారీ చోరీలకు పాల్పడ్డాడు. అతను ఈ నెల 15వ తేదీన విజయవాడ వాంబేకాలనీలోని కిరాణా, కూరగాయల షాపు షట్టర్ పగలగొట్టి రూ. 1.60లక్షలు చోరీ చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చోరీకి పాల్పడినది రాయుడు దుర్గారావుగా నిర్ధారణకు వచ్చారు. అతని కోసం ముమ్మరంగా గాలిస్తుండగా, అజిత్ సింగ్ నగర్ లోని ఓ భవనం పెంట్ హౌస్ లో ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం అతడ్ని పట్టుకునేందుకు పోలీసులు వెళ్లగా, పారిపోయేందుకు ప్రయత్నించే క్రమంలో దొంగ దుర్గారావు ఆ ఇంటి పై నుంచి దూకాడు. అప్పటికే కింద మాటు వేసి పోలీసులు అతడ్ని పట్టుకోగా, కొన్ని గాయాలయ్యాయి. వెంటనే అతడ్ని ప్రభుత్వాస్పత్రి ఎమర్జెన్సీ విభాగానికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. నిందితుడు దుర్గారావుపై కోనసీమ జిల్లా మండపేట టౌన్ స్టేషన్‌లో నాలుగు, రాయవరంలో రెండు, రావులపాలెం స్టేషన్ లో ఒకటి, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నున్న పోలీస్ స్టేషన్ లో ఒక చోరీ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

బాలుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుడివాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఆదివారం పూర్వాధ్యక్షులు రవీంద్రనాథ్ ఇంటి వద్ద గతంలో టైరుకు పంచర్ వేస్తూ తీవ్రంగా గాయపడిన శంకర్ అనే బాలునికి క్లబ్ సభ్యులు అధ్యక్షులు నల్లారి శేషగిరిరావు, సెక్రెటరీ అన్నే నవీన్, వై. రవీంద్రనాథ్, విజయ భాస్కర్, ఆర్. వేణు బాబు, కె.వి. రమణ, ఎం. వీరశేఖర్‌ల సహకారంతో రూ. 7వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

పంట కాలువలోని చెత్తచెదారం తొలగింపు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక పెద్ద కాలువ మరియు నేలపూడి ఛానల్ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త చెదారం, ఇతరత్రా వస్తువులను ఆదివారం ఇరిగేషన్ అధికారులు ప్రత్యేకంగా ప్రొక్లయిన్‌ను ఏర్పాటు చేసి తొలగించారు. బిజెపి టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ (ఆర్కె) నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా వెంటనే ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, రాజు, గాదె చరణ్, బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రకటన

మా క్లయింట్లన్నూ, కృష్ణాజిల్లా ప్రస్తుత ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ వన్‌టౌన్ వాస్తవ్యులైన **గుర్రం లక్ష్మి నారాయణ గారి భార్య, కుమారుడు** అయిన **గుర్రం నిర్మల, గుర్రం అనుదీప్ గార్ల** సంజాయిషీ పొంది అందరికినీ తెలియజేయటమైనది.

కృష్ణాజిల్లా ఉయ్యూరు వాస్తవ్యులైన **ముత్తి సుబ్బారావు గారి కుమారుడు నాగాంజనేయులు గారు** తన స్వార్జితపు సొమ్ముతో నర్సరావుపేట కాపురస్తులు **షహనాజ్ సుల్తానా గారి** నుండి క్రయము పొంది **21-2-1990వ** తేదీన విక్రయ దస్తావేజును వ్రాయించుకొని దానిని విజయవాడ సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో **971/90 నెం.** దస్తావేజుగా రిజిష్టర్ చేయించుకొనుట ద్వారా ఈ దిగువ షెడ్యూలు దాఖలా **47.34 చ.గ.** స్థిరాస్తి అందలి డాబా కట్టడములతో సహా వారికి సంక్రమించినది. వారి తల్లిగారైన లక్ష్మీకాంతమ్మ గారు షహనాజ్ సుల్తానా గారి నుండి క్రయము పొంది వారితో **5-5-1990వ** తేదీన విక్రయ దస్తావేజును వ్రాయించుకొని దానిని దస్తావేజు నెం. **2755/1990గా** రిజిష్టరు చేయించుకొను ద్వారా **43.25 చ.గజముల** స్థిరాస్థి అందలి డాబా కట్టడములు వారికి సంక్రమించినవి. సదరు నాగాంజనేయులు మరియు లక్ష్మీకాంతమ్మ గారు ఆస్తులు ఏకకండముగా ఉండి వెరసి **90.55 చ.గల** ఆస్తిలోని పాత కట్టడములను నిర్మూలించి కార్పొరేషన్ వారి అప్రూవల్ పొంది గ్రౌండు, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లులగల ఆర్.సి.సి. డాబా కట్టడములను నిర్మించుకొని జాయింటుగా అనుభవించుచూ ఉండగా లక్ష్మీకాంతమ్మ గారు **30-8-1990న** వ్రాయించి **410/90 నెంగా** రిజిష్టరు చేయించిన వీలునామా ద్వారా వారి మరణానంతరం అనగా **డి.11-1-2001వ** తేదీ దరిమిలా లక్ష్మీకాంతమ్మ గారి ఆస్తికూడా సదరు నాగాంజనేయులు గారికి సంక్రమించి, మొత్తం ఆస్తిలో రోడ్డు విస్తీర్ణములో కార్పొరేషన్ వారికి ఇవ్వగా మిగిలిన 67 చ.గ.ల షెడ్యూల్ దాఖలా ఆస్తిని సర్వహక్కులతో అనుభవించుచూ మా క్లయింట్లకు విక్రయించుటకు ఖరారు పడి వారినుండి అడ్వాన్స్ క్రయ ప్రతిఫలమును కూడా పొందియుండిరి. ప్రస్తుతము మా క్లయింట్లు సదరు వారికి బ్యాలెన్స్ క్రయ ప్రతిఫలమును చెల్లించి వారితో రిజిష్టరు విక్రయ దస్తావేజును పొందుటకు సిద్ధముగా ఉండిరనియు, సదరు క్రయము గురించి ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ, షెడ్యూలు ఆస్తిపై తనఖా, విక్రయ ఎగ్రిమెంటు, దీర్ఘకాలపు లీజు, జప్తు, ఇంజక్షను, మనోవర్తి వగైరా హామీలు, జాయింట్ జాగా లబ్ధి తగాయిదాలు వగైరా చెల్లదగిన క్లయములన్ననూ సదరు ఆక్షేపణలను, క్లయిములను ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలోగా వ్రాత పూర్వకముగా రిజిష్టరు పోస్టుద్వారా మాకు తెలియబరచవలయుననియు గడువులోపల ఎటువంటి ఆక్షేపణలు రానియెడల షెడ్యూలు ఆస్తిని నిష్పేచి ఆస్తిగా తీర్మానించి షెడ్యూల్ ఆస్తికి విక్రయ దస్తావేజును పొందుదురనియు ఆ దరిమిలా వచ్చే క్లయిములు, ఆక్షేపణలు మా క్లయింట్లను ఎంతమాత్రము బైండు చేయజాలవనియు ఇందుమూలంగా అందరికిని తెలియబరచటమైనది.

షెడ్యూల్ : లోగడ కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా పటమట సబ్ రిజిష్టారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, విజయవాడ టౌన్, గవర్నరుపేట, బందరు రోడ్డులో గల ఆస్తిని రెవిన్యూ వార్డు నెం. 10, ఎన్.టి.యస్. నెం. 133, మున్సిపల్ వార్డు నెం. 21ఎ, న్యూ అసిస్మెంటు నెం. 1073085597, డోరు నెం. 27-37-115 దాఖలా స్థిరాస్తిని హద్దులు: **తూర్పు:** యం.రామమోహనరావు గారి ఆస్తి హద్దు, **దక్షిణం:** ఆయుర్వే హాస్పిటల్ హద్దు, **పడమర** : ఎం.ఎస్.ఆంజనేయులు గారి ఆస్తి హద్దు. **ఉత్తరం** : బందరురోడ్డు. యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 67.0లు లేక చ.మీ. 56-02లు స్థిరాస్తి నివేశన స్థలము, సదరు స్థలములోని గ్రౌండు, ఫస్టు, సెకండ్ మరియు థర్డు ఫ్లోరుగా ఆర్.సి.సి. కట్టడములతో సహా.

సి. హెచ్.దామోదరరావు, అడ్వకేట్,
11-11-8, వట్టూరి వారి వీధి, విజయవాడ-1.
సెల్ : 9393999545

లాజర్ మృతి తీరనిలోటు

సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : విజయవాడ 49 డివిజన్ సీనియర్ పార్టీ సభ్యులు జీరా పెద్ద లాజర్ (59) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తన ఇంటి వద్దనే చనిపోయారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తె ఉన్నారు. చిన్ననాటి నుండి కమ్యూనిస్టు పార్టీపై ఆకర్షితులై అంకిత భావంతో పనిచేశారు, చిట్టినగర్ ఫ్రెజర్ పేట ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేశారు, ప్రస్తుతం 49వ డివిజన్ డివిజన్ కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు, పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు, మరణ వార్త తెలియగానే సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు లాజర్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు, సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య, కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, డివిజన్ పార్టీ కార్యదర్శి బోరా రామకృష్ణ, పార్టీ నాయకులు తిప్పాబత్తుల వెంకటేశ్వర రావు, సిహెచ్ యల్ రాజు, కోరంగి చిన్నారావ్, రంగారావు, రాంబాబు, తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

మహిళా నేతకు శ్రద్ధాంజలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : సీపీఐ సభ్యులు పాత 10వ డివిజన్ కార్యదర్శి బియ్యపు నరసింహారావు సతీమణి కృష్ణవేణి(75) శనివారం సాయంత్రం వృద్ధాప్యంతో మరణించారు. తన ఇంటి వద్ద ఉంచిన ఆమె మృతదేహానికి సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. కృష్ణవేణి పాత 10వ డివిజన్ మహిళా సమాఖ్య కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆమెకు ఐదుగురు సంతానం, వారి పిల్లలు కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. శ్రద్ధాంజలి ఘటించిన వారు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. దుర్గా భవాని, నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నగర నాయకులు డి.రమణమ్మ, సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు సింగ రాజు సాంబ శివ రావు, బుక్ బైండింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బండ్ల నరసింహారావు, నగర నాయకులు రాయన గురునాధం, సిహెచ్. రాజు,బియ్యపు కృష్ణ, భాను తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్త శ్రీధర్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం మానవతా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలోమ చంద్రయాన్ ప్రాజెక్టు ఇస్రో శాస్త్రవేత్త రాజా శ్రీధర్‌ను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు అన్నపురెడ్డి గోపిరెడ్డి, ఉపాధ్యక్షులు దండమూడి సీతారామస్వామి, జిల్లా మానవతాధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, మానవతా సభ్యులు దుద్దు వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నవీన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-తిరువూరు: కాశ్మీర్‌లో పహల్గావ్ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఆదివారం సీపీఐ తిరువూరు మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్దవరం గ్రామం చిలుకూరి పెద్ద పుల్లయ్యబస్టాండ్ సెంటర్ దగ్గర నుండి గ్రామ శివారు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి పర్యాటకులను చంపడాన్ని పిరికి పందాగా అభివర్ణించారు, కేవలం భారత పర్యటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడి చేయడం హేయం అన్నారు. హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించడానికి ఉగ్రవాదులు దాడులకు పాల్పడడం హేయంగా ఉందని అన్నారు. భారత దేశంలో కొందరు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని ముస్కరులదాడిని ఖండిస్తూ ఉగ్రవాదు దాడిలో మరణించిన పర్యాటకులకు జోహర్లు సమర్పించారు. పర్యాటకులను వీరోచితంగా పోరాడి కాపాడిన వీర మరణం పొందిన వ్యక్తికి జోహర్లు అర్పించారు. ఉగ్రదాడి చేసిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని దేశ ప్రజలకు రక్షణ కల్పించాలని ఖాళీగా ఉన్న రక్షణ దళ పోస్టులను ఫిల్ అప్ చేయాలని దేశంలోని ఉగ్రవాద ఆనవాలను కూకటివేళ్లతో పీకి వేయాలని దేశ ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కేంద్ర ప్రభుత్వం భారతదేశ ప్రజానీకానికి రక్షణ భరోసా ఇలాంటి ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ప్రజలు శాంతియుతంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ఉగ్రదాడిని దేశంలోని అన్ని గ్రామాల్లో కూడా నిరసన వెలువెత్తుతున్నాయి అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ తిరువూరు మండల పార్టీ కార్యదర్శి ఎన్ వనమాలి, మారిపోగు పుల్లయ్య, చిలుకూరి కృష్ణ, మాగంటి వెంకటి, పగిడిపల్లి కృష్ణ, రావూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : భారతదేశ కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు, యాజమాన్యానికి కట్టు బానిసలు చేసే విధంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు లింగం ఫిలిప్ అన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎనిమిది గంటలు పనిని అమలు పరచాలని కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ పది కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దానిలో భాగంగా మే 20వ తారీఖున సార్వత్రిక సమ్మెను దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు లింగం ఫిలిప్పు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇప్పటికీ 22 పర్యాయములు సార్వత్రిక సమ్మెలు గాని మహా పదవలు గాని చేయటం జరిగినదని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని కనీసం కార్మిక సంఘాలను చర్చలకు కూడా పిలవలేదని బిజెపి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. అధికా అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలనే ఊడ పీకుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి ఒక్కొక్క ఖాతాలో 15 లక్షలు వేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా వేయలేదని,పేదరికం రూపం మారుస్తామని నిరుద్యోగ నిర్మూలన చేస్తామని చెప్పి ఒకరికి కూడా ఉద్యోగం ఇచ్చిన పాపాన లేదని ఆయన అన్నారు. ఉన్న ఉద్యోగాల్ని పీకి వేస్తుందని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వారికి ఎడ పద కార్పొరేట్ యజమానులకు అప్పచెప్పడాన్ని ఆయన ఖండించారు. సిఐటియు కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రైవేటీకరణ విధానాన్ని విడనాడాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని రోజు 8 గంటల పనిని అమలు పరచాలని స్కీములో వర్కర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కూడా కల్పించాలని ఆయన కోరారు. మే 20వ తారీఖున దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు ఏఐటీయుసి, సిఐటియు, ఏఐఎఫ్‌టియు, న్యూ వైఎస్ఆర్పి ట్రేడ్ యూనియన్, ఐఎన్టియుసి, ప్రజా సంఘాలు ఉద్యోగులతో కలిసి మచిలీపట్నంలో విజయవంతం చేయడానికి తదుపరి సదస్సులు సమావేశాలు బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని దీన్ని జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కార్మిక ప్రజాసంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు ఈ సదస్సుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు ఏఐటియుసి అనుబంధ సంఘమైన మున్సిపల్ కార్మిక సంఘ కార్యదర్శి యర్రం శెట్టి ఈశ్వరరావు, సిఐటియు నాయకులు బూర సుబ్రహ్మణ్యం, సిహెచ్ జై రావు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు నాగేశ్వరావు కౌలు రైతు సంఘం నాయకులు రంగారావు సేలం నారాయణరావు అంగన్వాడి కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రమాదేవి వివిధ సంఘాల ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారించండి

విశాలాంధ్ర-పెడన : ప్రాణాంతకమైన ప్లాస్టిక్ను నివారించి ప్రతి ఒక్కరు పరువు పద్ధతిలో తమ తమ పిల్లలకు స్టీల్ బాక్సులు ఉపయోగించేలా తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బండారు ఆనందప్రసాద్ అన్నారు. బ్రహ్మపురం నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు చిన్న పిల్లలు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నివారణ ప్లే కార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు గుండెజబ్బులు, క్యాన్సర్ లాంటివి సంభవిస్తున్నాయని, ఇటువంటి వ్యాధుల భారీనుండి పడకుండా ఉండాలంటే ప్లాస్టిక్ ని పూర్తిగా నివారించాలని అన్నారు. అలాగే క్యారీ బ్యాగ్గను కూడా పూర్తిగా నిషేధించాలని పూర్వ మాదిరిగా చేతి సంచులను ప్రతి ఒక్కరు వినియోగించాలని కోరారు.

పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర- గుడివాడ : గుడివాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం గుడివాడ రైల్వే పోలీసులు మరియు గుడివాడ లా అండ్ ఆర్డర్ పోలీసులు మచిలీపట్నం నుండి వచ్చిన బాంబ్ డిక్టెటింగ్ పార్టీతో కలిసి ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. రైలుబండ్లలో జరుగుతున్న దొంగతనాలు పట్ల ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రోన్ కెమెరాలతో గుడివాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. గుడివాడ రైల్వే ఎస్ ఐ మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ రైలుబండ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కృష్ణాజిల్లా లా అండ్ ఆర్డర్ పోలీస్‌తో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ టూ టౌన్ సిఐ నాగ ప్రసాద్, రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షరీఫ్, గుడివాడ రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్, గుడివాడ కమర్షియల్ ఇన్స్పెక్టర్ భగవాన్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సుస్వర, సునాద మాంత్రికుడు అన్నవరపు



విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వారి మానస పుత్రుడు అన్నవరపు రామస్వామి వారి సంగీత సేవ నిరూపమానమని, ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ఎంతో మంది విద్వాంసులను సంగీత రంగానికి అందించిన ఘనత అన్నవరపు వారికి దక్కుతుందని, ఆయన సుస్వర, సునాద మాంత్రికుడని సామాజికవేత్త, కళాకారుడు డాక్టర్ వేమూల హజరత్తయ్య గుప్త అన్నారు. స్వర ఝరి వారి 37వ వార్షికోత్సవ వేడుకలలో స్వరఝరి వ్యవస్థాపకుడు మోదుమూడి సుధాకర్ దంపతులు గురువర్యులు పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి చింతలపాటి రాజ్యలక్ష్మి పురస్కారాన్ని గుప్త చేతుల మీదుగా ప్రదానం చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. శత వసంతాలు పూర్తి చేసుకున్న ఆయన నేటికీ వయోలిన్, వయోలా వాద్య ప్రదర్శనలివ్వటం గురుభక్తి, శిష్యవాత్సల్యం ఎంత గొప్పదో తెలుస్తోందన్నారు. వేదికపై వీణ విద్వాంసులు వివిఎల్ నారాయణరావు రచించిన జనక రాగ గ్రహభేద మంజరి గ్రంధాన్ని రామస్వామి ఆవిష్కరించారు. సభలో గాత్ర సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు మాట్లాడుతూ అన్నవరపు నాద నిధి, నాద యోగి అని సంగీతరంగాన అన్నవరపు అనగానే వయోలిన్, వయోలిన్ అనగానే అన్నవరపు గుర్తుకు వస్తారన్నారు. సంగీత కళాశాల ప్రిన్సిపల్ కె లక్ష్మీ నరసమ్మ మాట్లాడుతూ అన్నవరపు గురుకటాక్షకుడన్నారు. అదే వేదికపై మల్లాది కార్తీక త్రివేణి గాత్ర సంగీత కచేరీ జరిగింది.

ముందస్తు జాగ్రత్తతో నేరాల నియంత్రణ : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : వేసవి సెలవుల్లో ఇంటి భద్రత, సంరక్షణ చర్యలపై కృష్ణాజిల్లా పోలీసులు జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. సాధారణ రోజులతో పోల్చి చూస్తే వేసవికాలంలోనే ఇళ్లల్లో దొంగతనాలు అధికంగా జరుగుతుంటాయి. ఇందుకు ప్రధాన కారణం ఇంట్లో అందరు కలిసి ఊరు వెళ్లడం, రాత్రి వేళల్లో ఆరుబయట, మేడపైన నిద్రించేందుకు వెళ్లడం వలన జరుగుతుంటాయి. ప్రధానంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే వారి ఆట కట్టించేందుకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. ఈ వేసవికాలంలో ప్రజలు సురక్షితంగా, సంతోషంగా కుటుంబ సభ్యులతో గడపడానికి వీలుగా పోలీసు వ్యవస్థ ఎస్పీ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వేసవి సెలవుల సందర్భంగా ఇళ్లకు తాళం వేసుకుని ఊరికి వెళ్ళే వారు స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, తద్వారా రాత్రి, పగలు గస్తీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తార్. ఇంటికి ప్రధాన, వెనుక ద్వారాలకు తాళాలు, చుట్టు ఉన్న కిటికీలకు టవర్‌బోల్టులు వేయాలని, ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు కనబడేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం మంచిదని, ఇంటి బయట లైటు ఎప్పుడు వెలుగుతుండాలని, మీరు ఊరు వెళ్లే సమాచారం పక్కింటి వారికి, స్నేహితులకు లేదా బంధువులకు తెలిపితే వారు ఇంటిని పరిశీలిస్తుంటారన్నారు. మీ ఇంటి చుట్టుపక్కల అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనబడితే వెంటనే సమీప పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. ప్రజల సహకారంతో సమాజాన్ని సురక్షితంగా ఉంచగలమని, మీ బాధ్యత మా ప్రధాన ధ్యేయమని, మీ భద్రతకు కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని ఎస్పీ గంగాధర్ తెలిపారు.

బేడ (బుడగ) జంగంను ఎస్సీల్లో కొనసాగించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాజ్యాంగ బద్దంగా ఉన్న బేడ (బుడ్గ) జంగం కులాన్ని ఎస్సి జాబితాలో గతంలో లాగానే కొనసాగించాలని ఏపీ బేడ (బుడ్గ) జంగం క్రమ సంఖ్య – 9 షెడ్యూల్ కులం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 1950వ సంవత్సరం నుంచి రాజ్యాంగ బద్దంగా ఎస్సి జాబితాలో కొనసాగుతున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా 2023 అక్టోబర్ 10 వ తేదీ వరకు కొనసాగినట్లు తెలిపారు. ఎస్సి వర్గీకరణకు సంబంధం లేకుండా ఇప్పటి వరకు ఎస్సి జాబితాలోనే కొనసాగిన తమ కులాన్ని ఆన్ లైన్ లో నిలుపుదల చేయడం వల్ల తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో ఎస్సి జాబితా ద్వారా వచ్చే అవకాశాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సి వర్గీకరణ విషయంలో ప్రభుత్వం తమ కులాన్ని గ్రూప్- ఎ లో పెట్టి సామాజిక న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

కంచికచర్లలో కార్డెన్ చర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర-కంచికచర్ల: విజయవాడ సి పి ఉత్తర్వులు మేరకు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ముమ్మరంగా నిర్వహిస్తున్న కర్డెన్ సర్చ్ ఆపరేషన్ ఈ ఆపరేషన్లో భాగంగా కంచిక చర్ల పట్టణంలో తెల్లవారుజాము నుండి ఇందిరా కాలనీని ముమ్మరంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నందిగామ రూరల్ సీఐ చవాన్ మాట్లాడుతూ. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కుటుంబ సభ్యులు వివరాలు ఆధార్ కార్డుతో సహా వివరాలు సేకరించారు. తనిఖీలలో భాగంగా 27 బైకులు, ఒక కారు మరియు 3 ఆటోలను సరైన పత్రాలు లేవని సీజ్ చేసి కంచికచర్ల పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ తనిఖీలో నందిగామ సబ్ డివిజనల్ పరిధిలో ఉన్న ఇద్దరు సిఐలు 8 మంది ఎస్సైలు మరియు 70 మంది కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీ మొత్తం డ్రోన్ సర్వే లైన్స్ లో జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి ఆపరేషన్ నిర్వహించడం వల్ల అక్రమ కార్యకలాపాలకి కళ్లెం వేయచ్చని సీఐ తెలిపారు.

ప్రతిరోజు చలివేంద్రం ఆదివారం చల్లవేంద్రం: రవి

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామ ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిరోజు చలివేంద్రం ద్వారా మంచినీళ్ల సిద్ధం చేసి అందించటం జరుగుతుందని, అదేవిధంగా ఆదివారం మాత్రం చల్ల కేంద్రం ద్వారా మజ్జిగ ఏర్పాటు చేసి ప్రజలకు అందిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు వెంట్రప్రగడ రవిచంద్రశేఖర రావు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కమిటీ గ్రామ అధ్యక్షుడు దోర్నల కోటేశ్వరరావు, మజ్జిగ అందిస్తున్న దాత సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ నృత్య దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని యునెస్కో ప్రదర్శన కళలకు ప్రధాన భాగస్వామి అయిన ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్స్టిట్యూట్ (ఐటిఐ)యొక్క నృత్య కమిటీ సృష్టించిన భారతదేశంలోని నాట్య సాంప్రదాయాలైన కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిసి ఒడిసి, మణిపురి తదితర నాట్యాలను ఆరోజున ఒకే వేదికపై నిర్వహించే వీలుగా అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులలో ఏటా ఈ వేడుకలను కూచిపూడి నాట్య గురువులు నిర్వహించుకోవడం విశేషం. అలాగే ప్రతి సంవత్సరంభీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీ సిద్ధ యోగి జయంతి వేడుకలను, కూచిపూడి నాట్య లెజెండ్ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి సందర్భంగా ఏటా అక్టోబర్ 15 ప్రపంచ నాట్య దినోత్సవం వేడుకలను నాట్యకళాకారులు ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. 1982లో దీనిని వ్యక్తికి దాని విలువను ఇంకా గుర్తించని మరియు ఆర్థిక వృద్ధికి దాని సామర్థ్యాన్ని ఇంకా గ్రహించని ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు మరియు సంస్థలకు మేల్కొలుపుగా పనిచేస్తుంది. కాగా కూచిపూడిలో నాట్య గురు కళా రత్నడాక్టరువేదాంతం రాధేశ్యా ఆధ్వర్యంలోస్థాపించిన కూచిపూడి నాట్య శిల్పారామం ప్రాంగణములో అంతర్జాతీయనాట్యోత్సవం ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నారు. కావున కళాభిమానులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అంతర్జాతీయ నృత్యోత్సవం సందర్భంగాప్రముఖ నాట్య కళాకారులకు సత్కారం చేయనున్నారు. అలాగే రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే ఈ వేడుకలలో స్థానిక శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య కళా పీఠం వైస్ ప్రిన్సిపాల్ కళా రత్న డాక్టర్ చింతా రవి బాలకృష్ణ శిష్య బృందంతో నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు.

నేటి నుంచి గ్రంథాలయంలో వేసవి విజ్ఞానతరగతులు

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయం మొవ్వలో ఈనెల28నుండి జూన్6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులను ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11గంటలవరకు నిర్వహించనున్నారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిరోజు నీతికథల పుస్తకములుచదివించటం, వారి చేత కథలు చెప్పించడం జరుగుతుంది. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, పేపర్ క్రాఫ్ట్,క్యారమ్స్ , డ్రాయింగ్ మరియు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారిణి తూములూరికృష్ణకుమారి విద్యార్థులను కోరారు.

విద్యార్థిని ప్రణతికి మొండితోక అభినందనలు

విశాలాంధ్ర-నందిగామ:- మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు విద్యార్థి ప్రణతిని అభినందించారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 19వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సగ్గుర్తి దేవిడ్ కుమార్తె ప్రణతి పదవ తరగతి ఫలితాలలో 573 మార్కులు సాధించడంతో వారిని కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

ఉండ్రపూడిలో ముగిసిన గంగానమ్మ జాతర

విశాలాంధ్ర-పామర్రు : మండలంలోని ఉండ్రపూడిలో ఆదివారంతో ఘనంగాగంగానమ్మతల్లి జాతర ముగిసింది. గ్రామంలో గత మూడురోజుల నుంచి గ్రామ దేవత గంగానమ్మతల్లి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. జాతర మొదటి రోజు గుడి వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు, రెండవ రోజుపోతురాజుగడను గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద భక్తులు మొక్కుబడులు తీర్చుకోవటానికి రావడంతో సందడిగా మారింది.

దాసరికి ఘన నివాళులు

విశాలాంధ్ర-విస్సన్నపేట : మాజీ రాజ్యసభ సభ్యులు, సీపీఐ జాతీయ నాయకులు దాసరి నాగభూషణరావు వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ దాసరి చిత్రపటానికి పూలమాల వేసి, మాట్లాడారు. తిరువూరు, విస్సన్నపేట ప్రాంతాల్లో దాసరి సీపీఐ నేతగా చేసిన భూపోరాటాలు, ప్రజా ఉద్యమాలను ఈ సందర్భంగా వివరించారు. రాజ్యసభ సభ్యునిగా పలు గ్రామాల్లో సాగు, తాగునీటి వనరుల ఏర్పాటులో ఆయన తీసుకున్న చొరవ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాయప్ప, తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మి, మండల నాయకులు పితాని నాగేశ్వరరావు, పంతంగి నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి అవనిగడ్డలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థిని నంబూరు దీపిక (595), చెన్నగిరి చరిత (577), చెన్నగిరి యామిని (576)లను ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ చేతులమీదుగా ఘన సన్మానం జరిగింది. విద్యార్థినులకు జ్ఞాపికలు, టీటీడీ డైరీలు బహూకరించి అభినందించారు. ఉన్నత విద్య అభ్యసించి అవనిగడ్డకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహాసభ అవనిగడ్డ విభాగం అధ్యక్షులు కొల్లిపర రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు విస్సంశెట్టి శ్రీనివాస్, నాయకులు బెజవాడ ధన సురేష్, దేసు శేషగిరిరావు, భద్రి పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలం లోనిపెనుగొలను గ్రామంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ముగ్గురు విద్యార్థులకు ఆదివారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కటుకూరి సన (540), సంగెపు .స్నేహ (514), సంగెపు. మౌనిక (501) కు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున ప్రోత్సాహక నగదు, జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో కూడా మంచిగా చదివి ఉన్నత స్థాయి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా సేవ కమిటీ అధ్యక్షులు పూటుకూరు. నారాయణరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు ఎస్ .వి. మురళీకృష్ణ, ఎం. వెంకటేశ్వరరెడ్డి, ఎస్ .వెంకట నరసింహారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ వి. వెంకటరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏ. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నంబూరులో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెద కాకాని : మండల పరిధి లోని నంబూరు పంచా యతీ కార్యాల యంలో ఆదివారం సమగ్ర హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసు బాబు, ఆర్థోపెడిక్ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ షేక్ జాన్ షాహిద్, షుగర్ థైరాయిడ్ అన్ని రకముల సాధారణ సమస్యల వైద్య నిపుణులు డాక్టర్ బి.సాంబశివరావు పాల్గొని పేషెంట్లకు ఉచితంగా ఐదు వేల విలువ కలిగిన టెస్టులు, షుగరు, బీపీ, ఈసీజీ, ఎకో, బీఎండీ వంటి టెస్టులు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. వారికి గుంటూరులోని తమ హాస్పిటల్‌లో తక్కువ ఖర్చుతో టెస్టులు, వైద్యం అందిస్తారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-మేడికొండూరు: 21 ఏళ్ల క్రితం పేరేచర్ల ఎస్‌జీవీఆర్ హైస్కూల్‌లో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇప్పుడు మళ్లీ చదువులమ్మ ఒడి చేరి అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని రోజంతా సందడి చేశారు. మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ఎస్‌జీవీఆర్ హైస్కూల్ 2003-04 లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ కలిసి ఉత్సాహంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువుల కోటేశ్వరరావు, కొండవీటి రాజేంద్రప్రసాద్, కొడాలి లావణ్య, బైరపనేని లక్ష్మీ సునీత, ఇందిరాదేవి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రమాదేవి, శ్రీనివాసరావు, ఇతరు గురువులను ఘనంగా సత్కరించారు. విందు భోజనాలు ఆటపాటలతో ఉషారుగా గడిపారు.

మధుమేహ వైద్య శిబిరం

విశాలాంధ్ర-తెనాలి : డి3 శారద సర్వీస్ సొసైటి ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ యస్ బిల్డింగ్ నందు షుగర్ వ్యాధి వైద్యశిబిరం నిర్వహిస్తారని డా॥ డి.శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది రోగులు వివిధ ప్రాంతాల నుండి వచ్చారని చెప్పారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందించారాన్నారు. వచ్చిన వారందరికి అల్పాహారము అందించారు. కార్యక్రమంలో సొసైటి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-తెనాలి : కొత్తపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1974-75 సంవత్సరం 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు మౌలాబి అధ్యక్షత వహించారు. 50 సంవత్సరాల తరువాత అందరం ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు. నాటి గురువులు పిచ్చయ్య మాస్టారు, పిచ్చేశ్వరమ్మ టీచర్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబిలను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దానబోయిన కృష్ణ సాయిబాబు, పట్టెల మల్లేశ్వరరావు, అన్నవరపు మధు, సజ్జా మధుసూదనరావు, చిన్నం హేమచంద్రప్రసాద్, కొల్లిపర శంకరబాబు, గడ్డిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మహర్దశ: వల్లభనేని

విశాలాంధ్ర-తాడేపల్లి : కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో మత్స్యకారులకు మహర్దశ వచ్చిందని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మత్స్యకారు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకారుల జీవితాలలో వెలుగులు నింపారని అన్నారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే రూ.10 వేల భరోసాను రూ.20 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందని అన్నారు. సుమారు లక్ష ముప్పై వేల మత్స్యకార కుటుంబాలకు న్యాయం చేశారని అన్నారు. మత్స్యకారులు పడే బాధను కష్టాలను గుర్తించి ఆర్థిక సహాయం అందించటం పట్ల మత్స్యకారులు ఆనందంగా ఉన్నారని అన్నారు. మత్స్యకారులు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 40 ఏళ్ళుగా నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఎప్పుడూ జరగని విధంగా ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మొదటి విడతలో 3 వేల ఇళ్ల పట్టాలు దుస్తులు పెట్టి ఇచ్చారని అన్నారు. ఒక్క తాడేపల్లిలోనే 1300 ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. టీడీపీ, మత్స్యకారుల నాయకులు ఒలేటి రాము, సైకం నీలిమాదేవి, కొక్కిలిగడ్డ ప్రభావతి, కొక్కిలిగడ్డ సుబ్బారావు, లంకె సూర్యం, సైకం సాంబయ్య, నాగిడి శ్యామ్, సీహెచ్ రాంబాబు, మోకా చంద్రబాబు, గాడి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే జనసేన లక్ష్యం

విశాలాంధ్ర-తాడేపల్లి : పేద ప్రజలకు సేవ చేయడమే జనసేన పార్టీ లక్ష్యమని ఆ పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామ సచివాలయం వద్ద జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు స్ఫూర్తితో ప్రాతూరు జనసేన పార్టీ గ్రామ పార్టీ, రావెళ్ల కంటి ఆసుపత్రి, సిటీ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త సహకారంతో జనసేన నాయకులు ఉచిత మెడికల్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపును జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రాతూరులో కంటి, గుండె, క్యాన్సర్ వంటి సమస్యలపై ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహించడం సామాన్య, పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయిన జనసేన పార్టీ, జనసైనికులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చవ్వాకుల కోటేష్ బాబు, బడే కోమలి, శీర్ల లాల్ చంద్, మున్నా శ్రీనివాస్, అమ్మిశెట్టి సురేష్, జొన్న రాజేష్, ఇండ్ల జగదీష్, పాటిబండ్ల వెంకటేశ్వరరావు, దావులూరి శ్రీనివాసరావు, సంకురు నాని, సంకురు విజయ సాగర్, యాదల అభిషేక్, కళ్యాణం చంద్రశేఖర్, యాదల అభిషేక్ నంద, దావులూరి సాయి, దావులూరి సుబ్బు, మేళం రాజా, కిషోర్ బాబు, ప్రాతూరు రాజా, కళ్యాణం చంద్రశేఖర్, సుధీర్, సాయి, గణేష్, మొషేరాజ్, వాసు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

చర్చికి లోకేష్ గ్రానైట్ అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : చినకాకానిలో నూతనంగా నిర్మిస్తున్న పునీత జోసెఫ్ చర్చికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో గ్రానైట్ అందజేశారు. చర్చి ఫ్లోరింగ్‌కు అవసరమైన రూ.7 లక్షల విలువ చేసే గ్రానైట్‌ను తన సొంత నిధులతో కొనుగోలు చేయించి ఆదివారం స్థానిక నాయకులు ద్వారా చర్చి నిర్వాహకులకు అందజేయించారు. చర్చి నిర్మాణానికి గ్రానైట్ అందించాలని స్థానిక నాయకుల ద్వారా నిర్వాహకులు, సంఘ పెద్దలు మంత్రి నారా లోకేష్‌ను కోరగా స్పందించిన ఆయన రూ.7 లక్షలు వెచ్చించి గ్రానైట్‌ను పంపించారు. చర్చి నిర్వాహకులు, సంఘ పెద్దలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందే చర్చి నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని మాట ఇచ్చారని ఆ మాట ప్రకారమే గ్రానైట్ అందజేసి మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా హరి బాబు, ఉపాధ్యక్షులు పలగాని వెంకట నాగబాబు, పొన్నె కంటి సాంబశివరావు, నక్కా సాంబశివరావు, చాగర్లమూడి నరేంద్ర, ఆకురాత్రి సాంబశివరావు, పలగాని గంగాధర్ రావు, బొర్రా కిరణ్ కుమార్, కుక్కమళ్ళ శ్రీనివాసరావు, మల్లవరపు కోటేశ్వరరావు, మల్లవరపు చినబాబు, ఈపూరు మరియదాసు, కొప్పాకల ఓంకార్, కటారి జోజి, పత్తిపాటి బాలయేసు, ఎండూరు సత్యనారాయణ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-తుళ్లూరు : స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థుల కోసం 'వేసవి విజ్ఞాన శిబిరం'ను నిర్వహిస్తున్నట్లు తుళ్లూరు శాఖ గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ ఆదివారం తెలిపారు. గ్రంథాలయం పరిధిలోని విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు కథలు చదివి వినిపించడం జరుగుతుందని, దీంతో వారిలో వినగలిగే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదివించడం, 10.10 నుంచి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే తదితర అంశాలను నేర్పించడం జరుగుతుందని చెప్పారు. జూన్ 6 వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: విద్యార్థులకు ఇస్తున్న సుదీర్ఘ వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు లైబ్రరీ అధికారి బి అరుణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకు జరిగే వేసవి శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనము, పేపర్ ఆర్ట్ ప్రతిరోజు జరుగుతాయని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులను ఈ వేసవి శిబిరానికి పంపించాలని గ్రంథాలయాధికారి తెలిపారు.

విశాలాంధ్ర-తాడేపల్లి: శాఖ గ్రంథాలయం తాడేపల్లి నందు ఈనెల 28 వ తారీఖు నుండి జూన్ నెల 6 వరకు తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి శాఖ గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ భాష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో పిల్లలకు పుస్తకం చదివించటం, చదివింది రాయించటం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లీష్ అల్లికలు, రీసోర్స్ పర్సన్ చేత నేర్పించడం జరుగుతుందని తెలిపారు. సమ్మర్ క్యాంప్ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కావున వేసవికాలంలో పిల్లలందరూ గ్రంథాలయానికి విచ్చేసి ఈ సమ్మర్ క్యాంప్‌ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ భాష కోరారు.

నేటి నుంచి అవగాహన సదస్సు

విశాలాంధ్ర - దాచేపల్లి : రామాపురంలో మత్స్యకారులకు సోమ, మంగళ వారాల్లో వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కుటుంబరావు ఒక ప్రకటనలో తెలిపారు. తుఫానులు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలతో పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

కీళ్లవాతం పట్ల అప్రమత్తంగా ఉండాలి

రుమటాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: నేటి ఆధునిక జీవనశైలి నేపథ్యంలో కీళ్లవాతం పట్ల నిరంతరం అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ రుమటాలజిస్ట్ అండ్ ఇమ్యునాలజిస్ట్ డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక అవగాహన కార్యాలయంలో 'కీళ్లవాతం-జాయింట్ నొప్పులపై' ఆరోగ్య సభ ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సాధారణంగా కీళ్ల నొప్పులు వచ్చినప్పుడు ఆర్థోపెడిక్, న్యూరాలజీ వైద్యులను సంప్రదిస్తుంటారని, అయితే వారు సమస్యను గుర్తించిన ఎడల కాలయాపన జరిగి వ్యాధి తీవ్రత పెరిగి అనేక ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కీళ్ల నొప్పులు అనిపించినప్పుడు సాధ్యమైనంత త్వరగా రుమటాలజిస్టును సంప్రదించటం మంచిదని సూచించారు. పెద్దవాళ్లలో ముఖ్యంగా మెడ నొప్పి, నడుం నొప్పి, మోకాళ్ళ అరుగుదల, కీళ్లవాతం లాంటి సమస్యలను చూస్తుంటామని, మెడ భాగంలో డిస్కులు అరుగుదల వల్ల గాని, కండరాలు దెబ్బ తినడం వల్ల గాని, షుగర్ వ్యాధి అదుపులో లేని సందర్భంలో గానీ, కీళ్లవాతం సమస్య ఉన్న సందర్భంలో గాని ఫ్రోజెన్ షోల్డర్స్ సమస్య తలెత్తుతుందని అన్నారు. ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు తక్షణమే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించటం మంచిదన్నారు. వెన్నుపూస భాగంలోని డిస్కులు అరగటం వల్ల.. ఊబకాయం వల్ల.. పని ఒత్తిడి ఎక్కువైనందువల్ల.. వయసు రిత్యా సమస్య వస్తుందని పేర్కొన్నారు. మోకాళ్లలో కార్టిలేజ్ పొర దెబ్బ తినడం వల్ల మోకాళ్ళ అరుగుదల వస్తుందన్నారు. సాధారణంగా విశ్రాంతి స్థితిలో ఉన్నప్పుడు నొప్పి బాగా అనిపిస్తుంటే ఆ సమస్యను కీళ్లవాతంగా పరిగణించాల్సి వస్తుందని, ఈ సమస్యతో బాధపడేవారు ఉదయం లేచిన వెంటనే జాయింట్స్ పట్టి వేయడం లాంటి పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. ఇటువంటి పరిస్థితిని ఆటో ఇమ్యూన్ డిజార్డర్ అని కూడా అంటారు. కీళ్లవాతం సమస్య వచ్చినప్పుడు చేతివేళ్లు, మోచేతులు, మోకాళ్ళు, మోకాళ్ళ వెనుక భాగం, మడికట్టు, గిలకలు, పాదాలు లాంటి జాయింట్స్ వద్ద నొప్పి, వాపు వస్తుందని, ఇలాంటి లక్షణాలు గుర్తించిన వెంటనే రుమటాలజిస్ట్‌ను సంప్రదించాలని తెలియజేశారు. కీళ్లవాత సమస్య ఉన్న వారిలో నోటిలో పుండ్లు, చిగుళ్లలో, దంతాలలో సమస్య రావటం, జుట్టు పల్చబడి పోవటం, కళ్ళు పొడిబారటం, నీరసం, చెమటలు పోయటం, విరోచనం సరిగా అవ్వకపోవడం, ఒక్కొక్కసారి నీళ్ల విరోచనాలు అవ్వటం, యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగటం లాంటివి కూడా జరుగుతాయని అన్నారు. ఈ కీళ్లవాతం సమస్య ఎక్కువగా ఆడవారిలో వస్తుందని, ఈ సమస్య వచ్చినప్పుడు వారిలో హార్మోనల్ సమస్య తలెత్తి ఒక్కొక్కసారి ప్రెగ్నెన్సీ సమస్యలు కూడా వస్తాయని పేర్కొన్నారు. కీళ్లవాతం సమస్య ఎక్కువగా చలికాలం, వర్షాకాలంలో బాగా ఇబ్బంది కలుగజేస్తుందని, ఈ సమస్యతో బాధపడే వారిలో నడకలో తేడా.. కూర్చొని లేచే సందర్భాలలో ఇబ్బందులు ఎదుర్కోవటం జరుగుతుందన్నారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చల్లా అంజిరెడ్డి, కె.చంద్రశేఖర్, ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చే కంపెనీలకు భూములిస్తే తప్పేంటి..?

విశాలాంధ్ర - వినుకొండ : లక్షలమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందించే సంస్థలకు తక్కువధరకు భూకేటాయింపులు చేస్తే తప్పేంటని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. అసత్య ఆరోపణలకు పేటెంట్, కేరాఫ్ అడ్రస్ జగన్ అంటూ మండి పడ్డారాయన. ఆదివారం వినుకొండలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చాలన్న ప్రయత్నాలు చూసి ఓర్వలేకనే ఇలాంటి దిగజారుడు ప్రచారాలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాని సభకు వేలాది మందితో హాజరు...

2వ తేదీన ప్రధాని మోదీ అమరావతి రానున్నారు. లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్ట బోతున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వంటి అతిరథ మహారథులతో గొప్ప కార్యక్రమం జరగబోతోంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమానికి హాజరవు కాబోతున్నాం. వినుకొండ నియోజకవర్గం, పల్నాడు జిల్లా నుంచి వేలాదిమందిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

99పైసలకే భూకేటాయింపులు పచ్చి అబద్ధం..

విశాఖ కేంద్రంగా టీసీఎస్ ద్వారానే రూ. 1370కోట్ల పెట్టుబడులు, 12వేలమందికి ఉద్యోగాలు రాబోతున్నాయన్న జీవీ ఉర్సా కంపెనీకి 99పైసలకే భూకేటా యింపులన్న వైకాపా విమర్శల్ని ఖండించారు. రూ. 50లక్షల చొప్పున 56 ఎకరాలు, రూ. కోటి చొప్పున 3.5ఎకరాలు ఇచ్చిన వాస్తవాలు దాచి జగన్ అండ్ కో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే జగన్ వైకాపా అయిదేళ్ల పాలనలో కొత్త పరిశ్రమలు ఎందుకు రాలేదో, చెప్పాలని నిలదీశారు.

జగన్ అంటే నాకేంటి.. చంద్రబాబు అంటే ప్రజలకేంటి...

గత తెలుగుదేశం ప్రభుత్వంలో తలపెట్టిన లూలూ, టెంపుల్ టన్, అమర్‌రాజా విస్తరణలు జగన్ వచ్చాక ఎందుకు ఆగిపోయాయో ఎవరికి తెలియదని ఎద్దేవా చేశారు. జగన్ దోపిడీ వేధింపులు, అరాచకాలు, లంచాలకు తాళలేకనే అవన్నీ తరలిపోయాయన్నారు. పెట్టుబడులు పెడతామంటే నాకేంటని అడిగే జగన్‌కు, ఆ పరిశ్రమలు వస్తే ఎంతమందికి ఉపాధి వస్తుందని ఆలోచించే చంద్రబాబుకు పోలిక ఎక్కడని చురకలు వేశారు.

మద్యం కుంభకోణం బడాబాబులు జైలుకే..

వైకాపా ఆరోపణలకు కౌంటర్లో భాగంగా మద్యం కుంభకోణంపైనా ఘాటుగా స్పందించారు. సజ్జల శ్రీధర్ రెడ్డి, రాజ్ కసిరెడ్డిని పట్టుకుంటే జగన్ మద్యం కుంభకోణం వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఢిల్లీలో జరిగిన దానికంటే ఏపీలో 10రెట్ల పెద్దదిగా జగన్ ఏలుబడిలో ఆంధ్రప్రదేశ్‌లో మద్యం అక్రమాలు జరిగాయన్నారు. వారి దోపిడీ కోసమే పెద్దబ్రాండ్లను రాకుండా చేసి మరీ వేల కోట్లు కమీషన్లుగా దండుకున్నారన్నారు. ఆ ముసుగులో లక్షల కోట్లు దోచుకున్నందుకు మూల్యం చెల్లించక తప్పదు.

▸ మాజీ ఎమ్మెల్యే బొల్లా ఆరోపణలపై స్పందించిన జీవీ

దాడులపై బొల్లా రివర్స్ ప్రచారాలు.....

కూటమి ప్రభుత్వంపై, తనపై వ్యక్తిగతంగా బురద జల్లాలని చూస్తున్నారంటూ స్థానిక మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపైనా ఈ సందర్భంగా విరుచుకుపడ్డారు. కొచ్చెర్లలో జనసేన వారిపై దాడి జరిగితే రివర్స్‌లో ప్రచారం చేస్తున్నారన్నారని, బొల్లాపల్లి, బొమ్మరాజు పల్లి తండాలో తెలుగుదేశం కార్యకర్తలపై దాడి జరిగింది, దెబ్బలు తగిలింది వాస్తవం కాదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో అవేం చెల్లవన్నారు.

వైకాపా అయిదేళ్లలో వినుకొండ నియోజకవర్గాన్ని పంచుకుని మరీ దోచుకున్న బొల్లా ముఠా పేదల ఇళ్లస్థలాలను కూడా వదల్లేదని, ఆ ఉసురు తగిలే మట్టిగొట్టుకుని పోయారన్నారు. రేషన్ బియ్యం, మద్యంషాపుల్లో అడ్డగోలుగా దోపిడీ చేసింది కాక ఊరుకు 7 కి.మీ. అవల సొంత భూమినే అడ్డదారుల్లో పేదలకు అంటగట్టి రూ.14కోట్లు బొల్లా జేబుల్లో వేసుకున్నారని, అలాంటి వ్యక్తి మేక వన్నెపులిలా మాట్లాడడం తగదన్నారు.

ఒక్క రూపాయి అవినీతిని నిరూపించగలరా..

ఇదే సమయంలో తనపై, తమ కుటుంబంపై, తమ శివశక్తి ఫౌండేషన్‌పై మాజీ ఎమ్మెల్యే బొల్లా చేస్తున్న ఆరోపణల్లో ఒక్కదానిని నిరూపించగలరా? అవినీతి రుజువు చూపగలరా అని సవాల్ విసిరారు. పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవడమే తమ విధానమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు, ఆయుబుఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరి చలవకు జలబిందెల ఊరేగింపు

విశాలాంధ్ర - దాచేపల్లి : గామాలపాడులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయం, నగర పంచాయతీ కేంద్రం దాచేపల్లిలోని శ్రీవీర్ల అంకమ్మ తల్లి దేవస్థానాన్ని ఆదివారం టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి సందర్శించారు. రెండు ఆలయాల పూజా రులు, అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణ కుంభంతో ఆత్మీయ స్వాగతం పలికారు. గంగమ్మ తల్లి ఆలయంలో బోనాల ఏర్పాటు, అంకమ్మ తల్లి ఆల యంలో ఊరిని చల్లబర్చే జలబిందెల ఊరేగింపును తిలకించారు. రెండు చోట్ల ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తులు, మహిళలు వేలాదిగా పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తారని శాఖా ఇన్ ఛార్జ్ గ్రంథాలయాధికారి క్రోసూరి వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ శిబిరాలు జరుగుతాయని అన్నారు. ఈ శిబిరాలలో విద్యార్థులకు పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్, జి.కె, ఇతర అంశాలను నేర్పిస్తారని అన్నారు. విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంకమ్మ తల్లి తిరునాళ్ల వార్షికోత్సవం

విశాలాంధ్ర-రొంపిచర్ల: బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అంకమ్మ తల్లి ఆలయ తిరునాళ్ళ 35వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ పూజారులు వెంకటేశ్వర్లు, అంకాలు ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా, అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, పరిసర గ్రామస్తులు, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తిరునాళ్ళ సందర్భంగా రాత్రివేళల్లో ఆలయ ఆవరణలో భజనా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుండెపోటుతో ఎంపీటీసీ సభ్యుడి మృతి

విశాలాంధ్ర-అమరావతి: మండల పరిధిలోని ధరణికోటలో ఒకటో ఎంపిటిసి నడకుదురు వీరబాబు 42 గుండెపోటుతో మృతి చెందారు. కాగా పల్నాడు టీడీపీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ తెలుసుకొని ఆదివారం మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. అమరావతి మండల పార్టీ తెలుగుదేశం అధ్యక్షులు మల్లాది విష్ణు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కన్యధార వసంతరావు, భవిరిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు సానుభూతిని వ్యక్తం చేశారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-నూజెండ్ల: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 2025 -26 విద్యా సంవత్సరంలో ఉచిత విద్యను అభ్యసించడానికి ,ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యా శాఖ అధికారి నలబోలు రవిచంద్ర తెలిపారు. స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలలో ప్రవేశానికి మే 31 ,2020 మధ్య జన్మించి 5ఏళ్లు నిండి ఉండాలన్నారు.

జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - వినుకొండ : జర్నలిస్ట్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకో వాలని వినుకొండ నియోజకవర్గం జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ స్వర్గీయ ఉప్పు మస్తానావు నాలుగో వర్ధంతి సభ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం నిర్వహించారు. జర్నలి స్టులు, నాయకులు, అభిమానులు మస్తానావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ కరోనా బారిన పడి జర్నలిస్టు మస్తానావు మృతి చెందడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కరోనా సమయంలో జర్నలిస్టులో విధులు నిర్వహిస్తూ కరోనా బారిన పడి మరణించడం జరిగిందన్నారు. కరోనాతో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలను నాటి ప్రభుత్వం ఆదుకుంటామని హామీ ఇచ్చి మరిచిందన్నారు. కరోనా బారిన పడి మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి నేటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ జర్నలిస్టులు రాజవరపు ప్రకాష్ రావు, లగడపాటి వెంకట్రావు, యార్ల గడ్డ ఆజాద్, గంట కోటేశ్వరరావు, దేవిశెట్టి కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శ్రీను, నాయకులు పివి. సురేష్ బాబు, ఆర్, శ్రీనివాసరావు, గంధం కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, మల్లెల ప్రసాదు, పొట్లపాడు సాయిబాబా, అడపాల వెంకటేశ్వర్లు, కోకా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆధ్వర్యంలో లస్సీ పంపిణీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పేద ప్రజలకు సేవలు చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని, వృత్తిపరంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ జర్నలిస్టులు సేవా కార్యక్రమాలుచేపట్టడంఅభినందనీయమని మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు చెప్పారు. ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ప్రెస్‌క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు మజ్జిగ, లస్సీని ఒకటో డివిజన్‌లో కమిషనర్ చేతుల అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజల సమస్యల్ని వెలికి తీసే బాధ్యత నిర్వహించడమే కాకుండా, సమాజ సంక్షేమం కోసం కూడా ముందడుగు వేస్తుండటం అభినందనీయ మన్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడపా అశోక్, కార్యదర్శి షేక్ దరియావలి మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు యేచూరి శివ ఇచ్చిన పిలుపు మేరకు వేసవి లో లస్సీ, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. గతంలోనూ ఇదే తరహ కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. సమాజానికి మంచి జరగాలనే ఉద్దేశంతోనే జర్నలిస్టులుఎల్లప్పుడుపనిచేస్తుంటారని, ఇందులో భాగంగానే తాము ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమతో కలిసి నడుస్తున్న క్లబ్ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ రమణ రావు,తోట మల్లికార్జునరావు,ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కొప్పర్ల చందు, జాయింట్ సెక్రెటరీ సుందర్ బాబు, ,కొండెపాటి రమేష్, పెనుమల మనోహర్, కొనికి సాంబశివరావు, అమ్మనబ్రోలు శివనారాయణ, రావిపాటి రాజా, నరసింహుల శ్రీకాంత్ శానిటేషన్ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-దుర్గి: అన్ని బంధాలకంటే స్నేహ బంధమే గొప్పదని చాటి చెప్పారని గురు పూజ్యులు చక్రపాణి అన్నారు. ఆదివారం దుర్గి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1980-81 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో వారి గురు పూజ్యులు మాస్టర్ యస్ చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మీ అపూర్వ కలయిక అమోఘం అన్నారు. "ఇక సెలవు "తీసుకున్న తమ క్లాసు మేట్స్ ఆత్మ శాంతించాలని రెండు నిముషాలు నిలబడి మౌనం పాటించారు. పూర్వ విద్యార్థులు తమ తమ అభి ప్రాయాలను, తమ జీవన స్థితి గతులను గురించి వివరించుకున్నారు.పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకా రాలు అందిస్తామన్నారు.పాఠశాల విద్యార్థులచే కోలాట, నృత్యప్రదర్శన,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమం ను విజయవంతం గావించారు.పూర్వ విద్యార్థులకు మెమెంటో లను అందజేశారు.ముఖ్య అతిధులుగా విచ్చేసిన గురు పూజ్యులను ఘనంగా సన్మానించారు. రూ.50 వేల విలువ గల 12 బెంచీలను అందజేశారు. పి సూర్యచంద్రరావు, టి.శివ శంకర్, ఈశ్వర రెడ్డి, దార్ల నాగేశ్వరరావు, కాచర్ల శ్రీను, అభిమానులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి కింద పడి క్లీనరు మృతి

విశాలాంధ్ర - దాచేపల్లి : సిమెంట్ లోడు లారీకి పట్టకడుతూ ప్రమాదవశాత్తు కింద పడి క్లీనరు మృతి చెందిన ఘటన ఆదివారం కృష్ణానది తీరానున్న తంగెడలో చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన కారంపూడి వీరనాగిశెట్టి (37) లారీ క్లీనరుగా చేస్తున్నాడు. దీనిలో భాగంగానే శనివారం లారీకి తంగెడ వచ్చాడు. అక్కడ కర్మాగారంలో సిమెంట్ లోడు కాగానే బయటకు వచ్చిన లారీకి పట్ట కడుతున్నాడు. ప్రమాదవశాత్తు దాని పై నుంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందాడు. ఆదివారం పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సౌందర్ రాజన్ చెప్పారు.

స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలకు నోటిఫికేషన్

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలు జరుగుటకు ప్రతి పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ నోటిఫికేషన్‌తో పాటు ఓటర్ల జాబితాను కూడా విడుదల చేయడమైందని వెల్లడించారు. ఎన్నికలు ఆగస్టు ఏనిమిదో తారీకు జరుగుతాయన్నారు. ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్, ఎన్నికల సంబంధించిన వివిధ విధానాలను మార్గదర్శకాలను కూడా విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ ఓటర్ల జాబితా మీద ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 5వ తారీకు లోగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేసి వాటిని సరిచేసుకోవాలన్నారు. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష ఆంధ్ర ప్రదేశ్ వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ఎన్నికలు నిర్వహిస్తారన్నారు.

సనా వెల్ఫేర్ సొసైటీ సేవలు అమూల్యం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సేవలు విలువైనవని పలువురు ముస్లిం నాయకులు కొనియాడారు. సొసైటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం బాలుర ఉచిత సామూహిక ఖత్నా (వడుగులు) కార్యక్రమం ఆదివారం పట్టణంలోని పోలుబుడే ముస్లిం షాధీఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సనా సంస్థ అధ్యక్షుడు మోహమ్మద్ యూసుఫ్‌అలీ ధార్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. 150 బాలురకు ఖత్నా నిర్వహించి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఫ్తీ అనస్‌ఖాన్, షేక్ నజీర్ అహ్మద్, సయ్యద్ బషీర్ మేస్త్రి, కాగజి ఫారుక్, మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, కరిముల్లా, పఠాన్ జాఫర్‌ఖాన్, మౌలానా అబ్బాస్ ఖాన్, సనా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జమ్మూలో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జనసైనికుడు బద్రి నాయుడు ఆధ్వర్యంలో సంగడిగుంట మూడు బొమ్మల సెంటర్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికీ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పునర్ వైభవాన్ని చూడలేకే ఇలాంటి దాడులకు దాయాది దేశం పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి మెహబూబ్ బాషా, కొలసాని బాలకృష్ణ, శ్రీకాంత్, సోమి శంకరరావు, సోమీ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా శివశక్తి ఫౌండేషన్ సేవలు

విశాలాంధ్ర - వినుకొండ : శివశక్తి ఫౌండేషన్ ద్వారా రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ గంగినేని కల్యాణ మండపంలో శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్, పెదకానిలోని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరాన్ని జీవీ ప్రారంభించారు. శుక్లాల శస్త్రచికిత్సతో పాటు కంటి పొరలు తొలగించే చికిత్సలు చేయిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, పివి సురేష్ బాబు, గంగినేని రాఘవ, దాసరి కోటేశ్వరరావు, శంకర కంటి ఆస్పత్రి వైద్యులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యులు, ఆర్.ఎం.పి డాక్టర్లు, అధికారులు, కూటమి నాయకులు, శివశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాడవాడలా మేడే ఘనంగా నిర్వహించాలి

మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

విశాలాంధ్ర-మంగళగిరి : దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ రాజ్యాంగాన్ని లౌకికవాదాన్ని రూపుమాపేందుకు నిరంకుశతత్వంగా ముందుకు వెళ్తుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య విమర్శించారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశం జరిగింది. సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్లు మాట్లాడుతూ 139వ మేడే దినోత్సవం వాడవాడలా ఘనంగా నిర్వహించాలని అన్నారు. కార్మిక హక్కులను హరించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బలవంతంగా అమలు జరిపే ప్రయత్నం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం లోకి, ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకువెళ్లాలని వారు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా అన్నం పెట్టే రైతన్నను మరోసారి మోసం చేసిందని వారు మండిపడ్డారు. రైతులు అనేక రోజులుగా ధర్నాలు చేస్తే నరేంద్ర మోదీ వారి దగ్గరకు వెళ్లి అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలను పరిష్కరించకుండా దాటవేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలపై అవలంబిస్తున్న నిరంకుశ విధానాలపై వారు ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, కటారి జేసుదాస్, తుడుమెళ్ళ వెంకటయ్య, జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, ఉడత శ్రీనివాసరావు, ఉయ్యాల సత్యనారాయణ, ఆర్దల వెంకట్రామయ్య, బాపనపల్లి శ్రీనివాసరావు, ఎస్‌కే కరీముల్లా, సాంబశివరావు, నరేంద్ర, శివ, గోహార్ జానీ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-మంగళగిరి : నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా విశాలాంధ్ర మంగళగిరి విలేకరి చదలవాడ సాయిచంద్ బాధ్యతలు స్వీకరించిన విషయం విధితమే. ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆది వారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో చదలవాడ సాయిచంద్‌ను శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ సాయిచంద్ విశాలాంధ్ర విలేకరిగా కొనసాగుతూ, హ్యూమన్ రైట్స్ జాయింట్ సెక్రటరీగా నియమితులు కావటం అభినందించదగ్గ విషయమన్నారు. సాయిచంద్ భవిష్యత్తులో మరిన్ని పదవులను పొందటంతో పాటు, ప్రజలకు మరింత చేరువకావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. సాయిచంద్ మాట్లాడుతూ ప్రజలకు హ్యూమన్ రైట్స్ సంస్థ తరపున అవసరమైన సేవలందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, తుడిమెళ్ళ వెంకటయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, కటారి జేసుదాస్, జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, ఉడత శ్రీనివాసరావు, ఉయ్యాల సత్యనారాయణ, బాపనపల్లి శ్రీనివాసరావు, సాంబశివరావు, నరేంద్ర, ఎస్‌కే కరీముల్లా, శివ, గోహార్ జానీ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో ముస్లింల భారీ ర్యాలీ

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడిని ఖండిస్తూ.. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు కోరుతూ పట్టణంలో పిడుగురాళ్ల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ చేశారు. పెద్ద మసీదు నుండి ఐలాండ్ సెంటర్ మీదుగా ఎమ్మార్వో ఆఫీసు వరకు మత సామరస్యాన్ని కాపాడా లని నల్ల చట్టాలను రద్దు చేయాలని హిందూ ముస్లిం సిక్ ఈసాయి భాయ్ భాయ్ అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఫ్తీ మౌలానా మహమ్మద్ మాట్లాడుతూ పహ ల్గాంలో జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని, ఉగ్రవాదానికి మతానికి సంబంధం లేదన్నారు. ఖురాన్‌లో ఒక మనిషిని అన్యాయంగా చంపితే సమస్త మానవాళిను చంపి నట్టే అలాగే ఒక మనిషిని కాపాడితే సమస్త మానవాళిను కాపాడినట్టే అని ఉంటుందన్నారు. ఖురాన్ చదివితే వాళ్లు అన్యాయంగా ఒకరి ప్రాణం తీసేవారు కాదన్నారు. మైనారిటీ నాయకులు అమీర్ అలీ మాట్లాడుతూ పహల్గాం జరిగిన దాడిని ప్రతి భారతీ యుడు ఖండించాలని ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు, బీసీ నాయకుడు దూదేకుల ఖాసీం సైదా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, హిందూ ముస్లింలు ఐక్యంగా ఉండాలని కోరారు. ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యు లు ముజీబ్, ఆరిఫ్ మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన దాడిని కొంత మంది తమ స్వార్థ రాజకీయాల కోసం హిందూ ముస్లిం ఐక్యతకు దెబ్బ కొట్టేలా రాజకీయ లబ్ధి పొందాలని ముస్లింలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని తిప్పి కొట్టాలన్నారు. ఈ ర్యాలీలో తబ్లిక్ అమీర్, స్టీల్ ఖాసీం, కౌన్సిలర్ అబ్దుల్లా, ఖాదర్ వలి, అబ్దుల్ రజాక్, బాబావలి, పొందుగల గని, జునైద్ భాష, మున్నా, భాష, మోటర్ మస్తాన్ వలి, గోల్డ్ షరీఫ్, తాజుద్దీన్, సయ్యద్ రఫీ, అబ్దుల్ గని, జమాల్, జానీ భాష, ఎండి సిద్దిక్, సైదా వలి, కౌన్సిలర్ కరిముల్ల, సలాం, ఇంతియాజ్, యూసుఫ్ అలీ, జాని బాబు, నన్నేసా, ఉస్మాన్, ఇమ్రాన్, సలీం, ఉలేమాలు, ఇమామ్‌లు, ముఫ్తీలు, హాఫిజ్‌లు, మహిళలు, ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దాసరి నాగభూషణరావు వర్ధంతి

విశాలాంధ్ర-పెదకాకాని : భారత కమ్యూనిస్టు పార్టీ యోధుడు దాసరి నాగభూషణరావు 17వ వర్ధంతి సందర్భంగా పెదకాకాని సీపీఐ ఆధ్వర్యంలో దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ దాసరి కళాశాలలో చదువుకునే రోజుల్లోనే ఏఐఎస్ఎఫ్‌లో పనిచేస్తూ మార్క్సిస్టు సిద్ధాంతాలకు ప్రభావితుడై విప్లవ రాజకీయాలకు తన జీవితం అంకితం చేశారన్నారు. అంచలంచెలుగా ఎదిగి రాజ్యసభ సభ్యుడుగాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై పార్టీకి రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలందించిన మహనీయుడని కొనియాడారు. 1997లో తన రెండెకరాల భూమిని రాష్ట్ర సీపీఐ సమితికి ఒక ఎకరం భూమిని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌కు ఒక ఎకరం భూమిని చెందే విధంగా వీలునామా వ్రాసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టిన్, రామిశెట్టి శ్రీనివాసరావు, ఆదినారాయణ, కోటేశ్వరరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోండి: జేసీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పౌర గ్రంథా లయ శాఖ సంచాలకుల ఆదే శాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'వేసవి విజ్ఞాన తరగతులు' బ్రోచర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్ ఏ.భార్గవ్ తేజ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 98 శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 28వ తేది నుంచి జూన్ 6వ తేది వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పడం తదితర అంశాలు నేర్పిస్తారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉపగ్రంథపాలకు రాలు కె.ఝాన్సీ లక్ష్మి, లైబ్రేరియన్ ఎన్.నాగిరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు పల్నాడు జిల్లా, వినుకొండ మండలం, వెంకుపాలెం గ్రామ నివాసి **బొమ్మిశెట్టి కొండయ్యగారి కుమారుడు వెంకటేశ్వర్లు, సెల్: 6309181386** ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

వినుకొండ రెవిన్యూ గ్రామంలోని నా భూమికి సంబంధించిన మరియు నా పేరుతోగల **టైటిల్ డీడ్ (భూమి యాజమాన్యపు పత్రం) (ఖాతా నెం.1507)** ను నేను మాగ్రామం నుండి ఉప్పరపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రమునకు వెళ్ళుచుండగా ఎక్కడో జారిపడిపోయినది. తదుపరి టైటిల్ డీడ్ పుస్తకం కొరకు వెతికినను కనిపించలేదు. సదరు టైటిల్ డీడ్ ఎవరికైనా దొరికిన యడల పై తెలిపిన నా అడ్రస్సుకు కానీ లేక మా క్లయింటు అడ్రసు కానీ వెంటనే అందజేయగలరు.

పి. సైదారావు, బి.కామ్., బి.ఎల్., అడ్వకేట్, లాయర్స్ స్ట్రీట్, కొత్తపేట, వినుకొండ టౌన్, పల్నాడుజిల్లా. సెల్ : 9440825595

మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు

విశాలాంధ్ర-తాడేపల్లి: రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వేట నిషేధ కాలంలో జీవనాధారం కోల్పోతున్న జాలర్ల కుటుంబాలకు ప్రభుత్వం రూ.20వేల చొప్పున సాయం చేయనుందని అన్నారు. రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్లను అందించనుందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంతో మంగళగిరిలో దాదాపు 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వేసవి తాపానికి ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మాయాబజార్ వద్ద గల ఈస్ట్ పారిస్ చర్చి పక్కన చేపట్టారు. ఈ సందర్భంగా రవి హెల్పింగ్ హ్యాండ్స్ ఛైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో మంచి మార్పు కు బాటలు వేయాలనే ధ్యేయంతో ఈ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ప్రతి వేసవిలో ఇలాగే కొనసాగించాలనే సంకల్పంతో ట్రస్ట్ ముందుకు సాగుతోందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సామాజిక బాధ్యతను పెంపొందించడమే కాక, మానవీయ విలువల పరిరక్షణకు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

మండలాలకు పాఠ్యపుస్తకాలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రం నుంచి మండలాలకు చేర్చే కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి పాఠ్యపుస్తకాలు విద్యార్థులందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ రూపొందించారని అందులో భాగంగా జిల్లా కేంద్రం నుంచి మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ వజ్రబాబు, గుంటూరు మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం, జిల్లా పాఠ్యపుస్తకాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీపై అభ్యంతరాలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో అభ్యర్థులు తెలుపుతున్న వయోపరిమితి పెంపు, పరీక్షకు 90 రోజుల సమయం కావాలని, ఒకే జిల్లాకు ఒకే పేపర్ వంటి అభ్యంతరాలను పరిష్కరించాలని డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న కోరారు. ఆదివారం స్థానిక డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రామన్న మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డీఎస్సీ గురించి ఎప్పుడు అడిగినా ఎటువంటి వివాదాలకు తావులేకుండా నోటిఫికేషన్ ఇస్తామని చెబుతూ వచ్చారు. అచరణలో లక్షలాది మంది అభ్యర్థులను డీఎస్సీ పరీక్షకు దూరం చేసే విధానాలను రూపొందించారు. ఎప్పుడు లేని మార్క్స్ పర్సంటేజీని తీసుకువచ్చారు. ఇప్పటి వరకు అభ్యర్థులు చెబుతున్న అభ్యంతరాలపై మాట్లాడకపోవడం చూస్తే డీఎస్సీ నోటిఫికేషన్‌పై వారి చిత్తశుద్ధి అర్థమవుతున్నది. ఇప్పటికైనా మంత్రి స్పందించి వారి అభ్యంతరాలను పరిష్కరించాలని కోరారు. కృష్ణకాంత్, భార్గవ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు తరలివెళ్లిన
ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులలో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ ఈ విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులలో విద్యార్థులు రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదగడానికి రాష్ట్రంలో పేరుగాంచిన ప్రొఫెసర్ల చేత శిక్షణ తరగతులు బోధిస్తారని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చర్చించి భవిష్యత్తు కార్యాచరణకు శ్రీకారం చుడతామని తెలియజేశారు. విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమ రూపకల్పన చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ విద్యార్థులకు హామీలు ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా గాలికి వదిలేసారని మండిపడ్డారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, ప్రతి విద్యార్థికి తల్లికి వందనం హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం విద్యారంగంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిన పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.3580 కోట్లు విడుదల చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణకు శ్రీకారం: జిల్లా కార్యదర్శి యశ్వంత్

పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా గాజుల చెన్నయ్య

విశాలాంధ్ర- మాచర్ల : స్థానిక సీపీఐ కొమెరా వీరస్వామి భవన్‌లో ఆదివారం జరిగిన పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో గాజుల చెన్నయ్య సమీప ప్రత్యర్థి ఎస్ఎండి భాషపై 28 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారులు విష్ణు మునకల అప్పారావు, పగడాల సుధాకర్, మిద్దెపోగు బాబురావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 157 ఓట్లకు గాను 139 ఓట్లు పోలైనట్టు తెలిపారు. ప్రతి 2ఏళ్లకు ఎన్నిక జరుగుతుందన్నారు. ఇప్పటికి వరుసగా 7 సార్లు గాజుల చెన్నయ్య గెలుపొందినట్టు వారు పేర్కొన్నారు. చెన్నయ్యను సిపిఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ఘనంగా అభినందించారు. అనంతరం గాజుల చెన్నయ్య మాట్లాడుతూ కార్మికులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్మికులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు, తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొన్ని ప్రత్యేక పథకాలను కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ నుండి అందజేస్తానన్నారు. తన విజయానికి సహకరించిన కార్మికులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన్ను పూలమాలలతో ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, బత్తిన వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటస్వామి, యు.పుల్లారావు, ఓర్స్ విజయ్ కుమార్, ఉప్పుతోళ్ల అంజి, ఉప్పుతోళ్ల దుర్గారావు, మహంకాళి కొండలు, కొమెరా పెద శ్రీను, షేక్ మౌలాలి, మణికంఠ, నాగరాజు, షేక్ ముస్తఫా, సంచుల శ్రీను, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న సార్వత్రిక సమ్మెను తాడేపల్లిలో జయప్రదం చేయాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు నిర్ణయించాయి. ఆదివారం కేసీ వర్స్ యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు టి.వెంకటయ్య, సీఐటీయూ వేముల దుర్గారావు, ఏఐఎఫ్టియూ(న్యూ) ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ దర్శనపు సామేలు, ఐఎఫ్టియూ ఎం.చెన్నయ్య, వైఎస్సార్‌టీయూ ఆర్.శ్రీనివాసరాజు, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే వినాశకరమైన నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సమావేశం డిమాండ్ చేసింది. ఎనిమిది గంటల పని విధానం అమలు జరపాలని కోరింది. కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లి పట్టణంలో మే మూడో తేదీ అందరూ కంపెనీ మేనేజర్లకు సమ్మె నోటీసు అందజేయాలని, 9వ తేదీ సదస్సు నిర్వహించాలని, 20వ తేదీ పట్టణంలో పెద్దఎత్తున కార్మిక ప్రదర్శన నిర్వహించాలని తీర్మానించారు.

రేపటి నుంచి యథావిధిగా ఏఎన్‌యూ పీజీ పరీక్షలు



విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా ఈ నెల 29వ తేదీ నుంచి జరుగుతాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ ఆదివారం స్పష్టంచేశారు. పరీక్షల నిర్వహణ తేదీలలో ఎలాంటి మార్పు లేదని ఎట్టి పరిస్థితులలోనూ ఈ నెల 29 నుంచే ఏఎన్‌యూ పీజీ 4వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. 29వ తేదీన జరగబోతున్న పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని ఆయన సూచించారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కావలసిన అన్ని సదుపాయాలను సమకూర్చామని తెలిపారు. విద్యార్థులు అనువైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అసౌకర్యం కలిగినా వెంటనే వర్సిటీ అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అయితే, ఇటీవల సామాజిక మాధ్యమాలలో, పలు సోషల్ మీడియా వేదికలపై పరీక్షలు 2025 జూన్ 10 నుంచి ప్రారంభమవుతాయి అనే తప్పుడు ప్రకటన ప్రచారంలోకి వచ్చిందని, అలాంటి అసత్య సర్క్యులర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై తప్పుడు సమాచారం అందిస్తున్న వారిపై వర్సిటీ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి నామినేషన్



విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర(నాని) నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ భార్గవతేజకు నామినేషన్ పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఆశీస్సులతో నామినేషన్ దాఖలు చేశానన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్పొరేటర్లు అందరూ సహకరించి తనను గెలిపించాలని కోరారు. గుంటూరు నగర అభివృద్ధి కూటమి ద్వారానే సాధ్యపడుతుందని, గుంటూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన జరగబోయే మేయర్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా కోవెలమూడి నానిని అధిష్టానం నిర్ణయించింది. మేయర్ ఎన్నిక లాంఛనప్రాయమేనని, నానీ మేయర్ పీఠం అధిరోహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు డేగల ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

అటవీశాఖ అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా అటవీశాఖ జి.కృష్ణప్రియ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, నరసరావుపేట రేంజ్‌లలో అక్రమ వైల్డ్ లైఫ్ ట్రేడింగ్ పై ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల నుండి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనంను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా వినుకొండ, బొల్లాపల్లి, కారెంపూడి, దుర్గి, మాచెర్ల, పాపాయపాలెం, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, పాపాయపాలెం, నకిరికల్లు, అచ్చంపేట, పలు ప్రాంతాలలో నాకాబంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు పిడుగురాళ్ల కు చెందిన కే. విజయ్ కుమారి , వినుకొండకు చెందిన మాధవరావు,నరసరావుపేటకు చెందిన డి.వెంకటరమణ, మాచర్లకు చెందిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

అమృతరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: తాడికొండ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, విశాఖ ఉక్కు ఉద్యమ నేత కీర్తి శేషులు టి.అమృత రావు 35వ వర్ధంతి సందర్భంగా స్థానిక పీఎస్‌నగర్ నందు గల అమృతరావు విగ్రహానికి జాతీయ బిసి బహుజన ఫ్రంట్ తాటికొండ నరసింహారావు ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బహుజన మహాసభ కేంద్ర కార్యదర్శి జిఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ 1966లో ప్రారంభమైన విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం తీవ్ర రూపం దాల్చి 32 మంది యువత ప్రాణ త్యాగంతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధించారని పేర్కొన్నారు. తాటికొండ నరసింహారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమానికి ప్రధాన ఉద్యమ నేత స్వర్గీయ తమనపల్లి అమృతరావు చేసిన త్యాగాల ఫలితంగా ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పన జరిగిందని విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనతో భారతదేశానికి ఆర్థిక వనరులు సమకూరాయని తెలిపారు. అమృతరావు ఆశయాలని కొనసాగించాలని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా కాపాడుకోవాలని అమృత రావు విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఘంటా ప్రభుదాసు, జయసుధ, డేవిడ్ విలియమ్స్, జూపూడి శ్రీనివాసరావు, నల్లపు నీలాంబరం, విప్పర్ల ముత్యయ్య, ఎన్ కమల కుమారి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని లేమాన్ ట్రీ హోటల్ లో సభ్యుల సమావేశం జరిగింది. అనంతరం పలు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత కుట్టుమిషన్లు పంపిణి చేశారు. అనంతరం కైలాస వైకుంఠ వాహనాన్ని ప్రారంభించారు. జిల్లా గవర్నర్ ఎం. వెంకటేశ్వరరావు ఈ సేవ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పర్యటనలో భాగంగా పలు సేవ కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. పుట్టడాన్ని ఎంత ఆనందంగా జరుపుకుంటామో అంతిమయాత్ర కూడా ఎటువంటి ఇబ్బందులు పడకుండా జరుపుకోవాలని అనుకుంటారని అందుకోసం రోటరీ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో వాహనాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. దాతల సహకారంతో విజయవాడలోని పేదలకు అతితక్కువ ధరకే వాహనం అందిస్తామని అవసరమైతే ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రోటరీ మిడ్ టౌన్ సేవ కార్యక్రమాలలో ఎప్పుడు ముందువుంటుందని స్పష్టం చేశారు. అనంతరం విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గడ్డం రవికుమార్ మాట్లాడుతూ రోటరీ విజయవాడ క్లబ్ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో కైలాస వైకుంఠ వాహనాన్ని ప్రారంభించుకోవడం దానికి తాను దాత కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సుందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, డిస్ట్రిక్ అడ్వైజర్ యడ్ల పార్థ సారథి,క్లబ్ ప్రతినిధులు మధు కోనేరు, తొండేపు ఉదయ్, నందూరి త్రినాథ్, కరం వీర్ కౌర్, మద్దినేని శ్రీనివాస్,పి. శివశంకర్ తదిరులు పాల్గోన్నారు....

ఓబిసి కుల గణన జరిపి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : దేశ వ్యాప్తంగా జనగణన తో పాటు ఓ.బి.సి కులగణన జరపాలని ఆంధ్రప్రదేశ్ బి.సి.సంక్షేమం సంఘం

అధ్యక్షుడు కేసిన శంకర రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి, కళాక్షేత్రం వద్ద గల మహత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ ఆంబేద్కర్ విగ్రాహలకు వినతి పత్రాలను అంద చేశారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు ఓబీసీ కుల కులగణన జరపాలని ఆ వినతి పత్రంలో కోరామని అన్నారు. దేశ జనాభాలో 55 శాతంగా ఉన్న ఓబిసీల సంక్షేమం అభివృద్ధి కోసం. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని మేము కేంద్రాన్ని కోరామన్నారు. గాంధేయ పద్దతిలో శాంతియుతంగా ర్యాలి జరపే మేము సంఘవిద్రోహ శక్తులుమైనట్లు పోలీసులు వేదించి ఆరెస్ట్ లు చేశారని ఆవేధన వ్యక్తం చేశారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ వేధించారని ఆరోపించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్టీకకి బి.సిలు వెన్నుముక అని చెప్పుతారని పోలీసులేమో వేధిస్తాన్నారని అవేధన వ్యక్తం చేశారు. విజయవాడ బందరు రోడ్ లోని ఇందిరా గాంధి మున్సిపల్ స్టేడియం వద్ద నుండి మంగళ వాయిద్య దప్పులతో ఉత్సహం గా ర్యాలిని ప్రాంభించారు. అనంతరం మహత్మ జ్యోతిరావు పూలే,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రాహనికి దండవేసి నివాళులు అర్పించిన అనంతరం విగ్రహ మూర్తులకు వినతి పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కేసన శంకర్రావు రాష్ట్ర అధ్యక్షులు, కుమ్మరి క్రాంతి కుమార్ జాతీయ ప్రధాన కార్యదర్శి, అన్నవరపు నాగమల్లేశ్వరరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎన్ మూర్తి రాష్ట్ర ఉద్యోగ సంఘ అధ్యక్షులు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు రాష్ట్ర ఉద్యోగ సంఘ కార్య నిర్వాహక అధ్యక్షులు, మేకా వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి, ప్రధాన కార్యదర్శి, చెప్పాడా చందు నగర అధ్యక్షులు, హనుమంతరావు యువజన సంఘ కార్యదర్శి, మాలికాపుర కనకారావు రాష్ట్ర ఉపాధ్యక్షులు, కుక్కల సత్యనారాయణ కృష్ణాజిల్లా అధ్యక్షులు, మహేష్ గుంటూరు జిల్లా అధ్యక్షులు, పుల్లారావు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు బీసీ నాయకులు పాల్గొన్నారు.

పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర-అవనిగడ్డ: అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ కు పిన్న వయస్సులో గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హెూసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం 26వ తేదీ శనివారం క్లారెస్ట లోని ఫార్చ్యూన్ హెూటల్లో ఘనంగా జరిగింది. అకాడమీ నిర్వాహకుల ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథుల చేతుల మీదగా గౌరవ డాక్టరేట్ ను సర్పంచ్ విజయ్ కుమార్ అందుకున్నారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ నిర్వాహకులకు ఈ సందర్భంగా విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. తన సేవలను గుర్తించి తనకు గౌరవ డాక్టరేటును ప్రధానం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. ఫిబ్రవరి నెలలో హైదరాబాదులో సారస్వత పరిషత్ విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక మదర్ తెరిసా విశిష్ట సేవా జాతీయ పురస్కారం అందుకున్న విషయం విధితమే. కరోనా కష్టకాలంలో, ఇటీవల వచ్చిన వరదల సమయంలో అలాగే తన గ్రామ పంచాయతీ పరిధిలోని పేదలకు తన వంతు సాయం అందించడంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పంచాయతీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన దాసరి విజయ్ కుమార్ సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, ప్రముఖులు, అధికారులు అభినందనలు తెలుపుతున్నారు. దాసరి విజయ్ కుమార్ భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరెన్నో ఉత్తమ అవార్డులు అందుకోవాలని గ్రామ పంచాయతీ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ పి ఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు అప్పటి విద్యార్థులు కుశల ప్రశ్నలతో ఉత్సాహ వాతావరణంలో కొనసాగింది. 2001 ూ2002 సంవత్సరంలలో చదివిన విద్యార్థిని విద్యార్థులు తమను ఎంతో క్రమశిక్షణతో తీర్చి దిద్దిన ఉపాధ్యాయులను పుష్పగుచ్చాలు,శాలువాలతో సన్మాన సత్కారాలు చేసి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీదేవి(పూర్తి అదనపు బాధ్యతలు), అప్పటి నాన్ టీచింగ్ సిబ్బంది అయినాగొరిపర్తి శ్రీ వెంకటశేషగిరి (ఉయ్యూరు. ఎంపిడిఓ), పూర్వపు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులైన కె సుబ్బరాజు, మోహన్ దాస్ , కె ఆర్ కె శర్మ , టి మారుతీ రావు, ప్రవీణ్, గందు కృష్ణ ప్రసాద్, సిహెచ్ శివశంకర్, జె గణపతి శాస్త్రి, ఎ రాణి, పి లక్ష్మి, తేరేజమ్మ, సుబ్రహ్మణ్యం,ఎం వంశీ,అనిత,డి ప్రభాకరరావు లను సత్కరించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వంశీకృష్ణ, సాంబశివరావు, అనిల్, రమేష్, నవీన్, యాసీన్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సద్గురువు త్యాగబ్రహ్మ జయంత్యుత్సవములు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మే 4వ వరకు సత్యనారాయణపురం శ్రీ శృంగేరి శారదా పీఠ పరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) లో జరిగే సంగీత సద్గురువు శ్రీ త్యాగరాజ స్వామి వారి 258వ జయంత్యుత్సవములు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సాయంత్రం ఐదు నుంచి రాత్రి 9 గంటల వరకు జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా కేవలం సంగీత సద్గురువు త్యాగబ్రహ్మ వారి కృతులతో సంగీత కళాకారులు వారి వారి ప్రదర్శనలను ఇచ్చి త్యాగయ్యకు సంగీత నీరాజనాలర్పిస్తారు. సంస్థ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ వారి కుటుంబ సభ్యులు, తదితర సంస్థ సభ్యులు నిర్వహణ చేస్తున్నారు.

గిన్నిస్‌బుక్‌లో ముదిరాజ్ 'ఆణిముత్యం'!

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామానికి చెందిన గణపవరపు సతీష్ , వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె కుమారి జి . అశ్విని (12) గిన్నిస్ బుక్ లో చోటు దక్కించు కుంది. తన తొమ్మిదవ ఏట కూచిపూడి నృత్యంలో అరంగేట్రం చేసిన చిన్నారి అశ్విని కఠోర శ్రమతో అనేక ప్రదర్శనలిచ్చి తన ప్రతిభను చాటుకుంది. గన్నవరంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 6 వ తరగతి పూర్తిను చేసుకుంది. "పువ్వు పుట్టగానే పరిమళించినట్లు" పేద కుటుంబంలో జన్మించినా అశ్విని పట్టుదలతో విద్యాభ్యాసం చేస్తూనే తానెంచుకున్న కూచిపూడి నాట్య రంగంలో రాణిస్తూ తన ప్రతిభకు పదును పెట్టింది. అశ్విని లోని ప్రతిభను గుర్తించిన గిన్నిస్ బుక్ సంస్థ ప్రతినిథులు ఆ చిన్నారి కి గిన్నిస్ బుక్ లో స్థానం కల్పించారు. ఈ విషయాన్ని ఆవుటపల్లికి చెందిన శ్రీ లలితా నృత్య అకాడమీకి చెందిన మాస్టర్ వనజా చంద్రశేఖర్ కుటుంబసభ్యులకు తెలిపి "గిన్నిస్ బుక్" మెడల్ ను బహుకరించి అభినందించారు .

సెహభాష్ అశ్విని ! ముదిరాజ్ సంఘం

అభినందన : నిరుపేద కుటుంబంలో జన్మించిన అశ్విని తన జీవితం (కొందరిలా) వడ్డించిన విస్తరికాదని గమనించిన ఆ చిన్నారి తల్లి కష్టాలను ,శ్రమను , పట్టుదలను గమనించి అమ్మ స్ఫూర్తితో ముందుకి సాగుతోంది .... తన గమ్యాన్ని , లక్ష్యాన్ని నిర్దేశించుకుంది..అందుకు నిరంతరం శ్రమించింది తానేమిటో నిరూపించుకుంది. భవిష్యత్లోకూడా నీకు నీవు "సాన" పెట్టుకుని మరింత ఎదగాలని ముదిరాజ్ సంఘం ఆకాంక్షిస్తోంది . అభినందిస్తోంది. అని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి కృష్ణమోహన్ , ప్రధానకార్యదర్శి బండారు వెంకటరాజు , ముదిరాజ్ ఉద్యోగులసంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాస్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మళ్ల రామచంద్రమూర్తి , గౌరవాధ్యక్షులు ప్రొ. మచ్చ భాస్కర్ తదితరులు ఒక ప్రకటనలోఅభినందించారు . మీకు మా అండదండలు ఎల్లవేళలా వుంటాయని భరోసా కల్పించారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి 2025 హంటర్ 350

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): మధ్యస్థ సైజు మోటార్‌సైకిల్ విభాగంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్, 2025 హంటర్ 350ని పరిచయం చేసింది. ఇది దాని ప్రముఖ స్ట్రీట్ రోడ్‌స్టర్ యొక్క తాజాదనపు ఫీచర్లతో నిండిన ఉన్నతీకరణ అయి ఉంది. ప్రపంచంలోని చల్లని ఇరుగుపొరుగు పరిసరాల నుండి ప్రేరణ పొంది, వాటి కోసం రూపొందించబడిన 2025 హంటర్ 350 మూడు కొత్త వర్ణమార్గాలు, ఉన్నతీకరించబడిన ఫీచర్లను అందిస్తుంది పట్టణ మోటార్‌సైకిల్ ఎలా ఉండాలని భావిస్తామో.. సహజమైన, చురుకైన, శ్రమరహితమైన శైలితో అలాగే దాని స్థాయిని పెంచుతూనే ఉంది. 2025 హంటర్ 350 బుకింగులు అధీకృత రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్‌లన్నింటిలోనూ, రాయల్ ఎన్‌ఫీల్డ్ డాట్ కామ్ పై అందుబాటులో ఉన్నాయి.

మాగంటికి ఆర్ఎంపిల సత్కారం

విశాలాంధ్ర-గుడివాడ : ఐఎంఎ గుడివాడ శాఖ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మాగంటి శ్రీనివాసును ఆదివారం ఆయన స్వగృహంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిధికి లోబడి గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యం అందజేయాలని అన్నారు. సీఎంఈ క్లాసులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు ప్రసాదరావు, బి.హెచ్.ఎం.పి.ఏ రాష్ట్ర నాయకులు నందూరి ఉమాశంకర్, కోలా వెంకటేశ్వరరావు, బిహెచ్ఎంపిఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, కార్యదర్శి పోలా సింహాచలం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగ చంద్రశేఖర్ (నాని) బీహెచ్ఎంపిఏ గుడివాడ ఏరియా అధ్యక్షుడు పంగా ఎర్రం నాయుడు, కోశాధికారి చీకుర్తి ప్రదీప్ కుమార్, నాయకులు జెవి లక్ష్మీనారాయణ, కంబాల శ్రీనివాస్ చల్లా చంద్రశేఖర్, పోలన సురేష్ బాబు, వై.శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర-తాడేపల్లి : అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐకాన్ క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. అపార్ట్‌మెంట్‌లోని వివిధ విభాగాల్లో ఉన్న వారందరూ తొమ్మిది గంటలకి ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. తమ తమ రోగాలకు సంబంధించి ఏర్పాటు చేసిన వైద్య విభాగాల వద్దకు వెళ్లి డాక్టర్ల ద్వారా వైద్య సహాయం అందుకున్నారు. విజయవాడ బందర్ రోడ్ స్రవంతి హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ శ్రీనివాస్, డాక్టర్ రవికుమార్, పెద్దఎత్తున వైద్య బృందం, వైద్య సిబ్బంది రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 300 మంది ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఎముకలు, కీళ్ళు, వెన్నుపూస సమస్యలు, స్త్రీ ప్రసూతి, లాపారోస్కోపీ సేవలు, బీపీ, షుగరు, థైరాయిడ్, జనరల్ వైద్య సేవలు, గుండె సమస్యలు, చిన్నపిల్లలకు సంబంధించిన వివిధ రకాల రోగాలకు సంబంధించి శిబిరంలో రోగులు ఉచితంగా వైద్యం అందుకున్నారు. ఈసీజీ, ఏకో, కంటి శుక్లాల పరీక్షలు, రక్త పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్ష(బీఎండీ) పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఐకాన్ ప్రెసిడెంట్ ఎం.వినోద్ కుమార్, సెక్రెటరీ ఎస్‌కే రియాజ్ భాషా, ట్రెజరర్ యు.రాజశేఖర్, విక్రమ్, ప్రకాష్, రమేష్, వి.స్వాములు, కె.లక్ష్మీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -అమరావతి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 28 నుండి జూన్ ఆరో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను మండల కేంద్రమైన అమరావతి లోనే శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథాల ఇన్చార్జి ఎం వెంకాయమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ 40 రోజులు పాటు వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు శిబిరాలు కొనసాగు ఉందని తెలిపారు ఈ శిబిరాలకు విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు పాల్గొనాలని తెలిపారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు వేసవి శిబిరాల్లో కథలు చదివి వినిపించటం పుస్తకాలు చదవడం పుస్తక సమీక్షలు కథలు చెప్పటం స్మోకింగ్ ఇంగ్లీష్ డ్రాయింగ్ పెయింటింగ్ పేపర్ క్రాఫ్ట్ డాన్స్ మై కింగ్ సెస్సు కార్యమ్స్ క్విజ్ జీకే వంటి అంశాలతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వెంకాయమ్మ కోరారు వేసవి సెలవుల సందర్భంగా విజ్ఞానం వికాసం వినోదాన్ని కలిగించేజిలాంటి శిబిరాన్ని జయప్రదం చేసే దాంట్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు.

పోటీ పరీక్షలతో మేదస్సుకు పదును

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రణాళిక ప్రకారం డిఎస్సి చదివితే ఉద్యోగం సాధించటం చాలా తేలికని, గుంటూరు జయం స్టడీ సర్కిల్ డైరెక్టర్ కే.రాజ్ కుమార్ అన్నారు. డాక్టర్ ఏ.పీ.జే అబ్దుల్ కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ మరియు జయం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో, స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం రాత్రి డీఎస్సీ మీద ఉచిత అవగాహన సదస్సు కల్పించారు. అకాడమీ టెక్స్ట్ బుక్స్ తో పాటు పోటీ పరీక్షలకు మేళకువలు నేర్చుకోవాలని ప్రముఖ సైకాలజీ అధ్యాపకులు టి.సుగంధర్ రావు అభ్యర్థులను ఉద్దేశించి అన్నారు. పోటీ పరీక్షలు మనలోని మేధస్సుకు పదును పెడతాయని పట్టుదలతో కూడిన శ్రమ తోడైనప్పుడు విజయం సాధించటం చాలా తేలికని మరొక సైకాలజీ అధ్యాపకులు షేక్. జిలాని అన్నారు. అలాగే జయం స్టడీ సర్కిల్ అధ్యాపక బృందం ఎస్ మర్యాదాస్, పి.సతీష్, కే. సుబ్బారావు నిరుద్యోగ అభ్యర్థులు మరియు ప్రైవేటు ఉపాధ్యాయులను ఉద్దేశించి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు షేక్ జాఫర్, ప్రైవేటు ఉపాధ్యాయులు షేక్. మాలిన్, ఐ వి సుబ్బారావు, చుండి శివప్రసాద్, ఆదినారాయణ, పార్థసారథి, మైన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదం షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవిఘ్నేశ్వరస్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర- పెదకూరపాడు : మండల పరిధిలోని, 75త్యాళ్ళూరులో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయ 26వ వార్షికోత్సవం ఈనెల 28 తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపారు. సోమవారం ఉదయం ప్రాతః కాలంలో తోరణపాకు మహోత్సవం,8గంటలకు పంచామృత విశేషఅలంకారము,విశేషపూజ, జరుగుతుందని తెలిపారు.

బయ్యారం జత పళ్ల ఎడ్లకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర - దాచేపల్లి : శ్రీవీర్ల అంకమ్మ తల్లి దేవస్థానం సిల్వర్ జూబ్లీ కొలుపుల తిరునాళ్లలో భాగం గా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రద ర్శనలో శనివారం రాత్రి జత పళ్ళ ఎడ్ల పోటీలు ముగిశాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల రైతులకు ఆదివారం దాతల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేత గూడా శ్రీనివాసరావు తెలిపిన సమాచారం ప్రకారం విజేతల వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా బయ్యారానికి చెందిన కేవింకే బుల్స్ కడియం మణికంఠ ఎడ్లకు ప్రథమ స్థానం వరించింది. ప్రకాశం జిల్లా బసినేపల్లిలోని యండ్లకుంట వెంకట చైతన్య కుమార్ ఎడ్లకు ద్వితీయం, వైఎస్సార్ జిల్లా పాలూరుకు చెందిన మేమలత బుల్స్ కొండల హేమల తారెడ్డి ఎడ్లకు తృతీయం, పల్నాడు జిల్లా అబ్బూరు, మాచాయ పాలెంనకు చెందిన నక్కా బలరామకృష్ణయ్య యాద వ్, గౌరు కార్తికేయ ఎడ్లకు నాలుగో స్థానం, దాచేపల్లిలోని కేకేఆర్ బుల్స్ కల్లూరి కార్తీక్ నాయుడు, భార్గవ్ నాయుడు ఎడ్లకు ఐదో స్థానం, తెలం గాణ సూర్యాపేట జిల్లా మేళ్ళ చెరువు లోని కేఆర్ఆర్ బుల్స్ కొప్పుల గోవర్ధన్ రెడ్డి, ప్రవలీష్ రెడ్డి ఎడ్లకు ఆరో స్థానం లభించింది. వరుసగా వీరందరికీ నగ దు బహుమతులను దాతలు ఇచ్చారు. వారిలో బచ్చు సుధీర్ రూ.20 వేలు, రుద్రాల అచ్చారావు, ముస్యం శ్రీనివాస రావు, బొడ్డపాటి రామకృష్ణ రూ.15 వేలు, గుండ్రెడ్డి విష్ణుమూర్తి, అనంత కోటేశ్వరరావు రూ.10 వేలు, కమతం శ్రీనివాసరావు రూ.8 వేలు, ఆశం అచ్చిరెడ్డి రూ.6 వేలు, గుదే నిహారిక రూ.5 వేల చొప్పున అందజేశారు. అదే విధంగా మునగా పెద ఆదినారాయణ, మునగా చిన ఆదినారాయణ షీల్డులను బహుకరించారు.

ఆదివారం రాత్రి నాలుగు పళ్ళ ఎడ్ల పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి ఎనిమిది జతల ఎడ్లు వచ్చాయి. ఈ పోటీలను పలువురు నాయకుల చేతుల మీదుగా ఆరంభిం చారు. కార్యక్రమాల్లో దేవస్థానం అభి వృద్ధి కమిటీ, ఎడ్ల పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధి జూలకంటితోనే సాధ్యం

మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి

విశాలాంధ్ర-దుర్గి : శ్యామరాజుపురం గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన తాటి రామారావు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శనివారం వైసీపీ నుండి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా తాటి రామారావును టిడిపి కండువాతో సాదరంగా పార్టీలోకి యాగంటి మల్లికార్జునరావు ఆహ్వానించారు. అనంతరం యాగంటి మాట్లాడుతూ నాటి జగన్ ఐదేళ్ల పాలనలో అరాచకం రాజ్యమేలిందన్నారు. సంక్షేమ పథకాలను ఎరవేసి లక్షల కోట్లను దోచుకున్నారన్నారు. జగన్ హయాంలో ఏ ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి రాలేదని, దీంతో లక్షలాది మంది యువత నిరుద్యోగులుగా మిగిలారన్నారు. మూడు రాజధానుల పేరుతో ప్రజలను మోసం చేసి రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశాడన్నారు. జగన్ మోసపూరిత ప్రకటనలను ప్రజలు నమ్మడం లేదన్నారు. 11 సీట్లతో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా రాష్ట్ర ప్రజలు జగన్ కు బుద్ధి చెప్పినా అతని ప్రవర్తనలో ఇంకా మార్పు రాలేదన్నారు. జగన్ శవ రాజకీయాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడన్నారు. అవినీతికి పాల్పడి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకొని జైళ్ళపాలైన వైసిపి నాయకులను పరామర్శించడం సిగ్గుచేటున్నారు. కార్యక్రమంలో దుర్భాకుల ప్రసాద్, వీరు, మాగులూరినారయ్య, మేకల దాసు, జానకిరామయ్య, సింగు నాగేశ్వరావు, టీడీపీ చావా రామారావు, బట్టు శ్రీను, బుజ్జి, నాగేశ్వరావు, హనుమంత్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో ఆదివారం రాత్రి వామపక్షాలు, ముస్లిం యూత్, మాలమహానాడు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఇటీవల పహిల్గా ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ పహిల్గా లో టూరిస్టులు గా వెళ్ళిన వారిని ఉగ్రవాదులు దాడి చేసి చంపడం దారుణమని అన్నారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

విశాలాంధ్ర-యడ్లపాడు: హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఆదివారం యడ్లపాడు విచ్చేశారు. స్థానికులు, విశ్రాంత దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ పోపూరి గంగయ్య చౌదరి తో గల పాత పరిచయం నేపధ్యంలో వచ్చిన న్యాయమూర్తికి చౌదరి ఆతిథ్యం ఇచ్చారు. గంగయ్య చౌదరి, భారతి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పలు విషయాలపై ముచ్చటించారు. కార్యక్రమంలో న్యాయవాది రమణకృష్ణ, నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ చెరుకూరి సృజన, పోపూరి వెంకటేశ్వర్లు (చిన్నా), రాఘవయ్య, వెంకటరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

30న ప్లాటినం జూబ్లీ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గల ప్రోలయ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్లాటినం జూబ్లీ భవనం ప్రారంభోత్సవం ఈ నెల 30వ తేదీన జరుగునని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ప్రతాపరెడ్డి తెలిపారు. ఆదివారం నంబూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మూడు సంవత్సరాల క్రితం పూర్వ విద్యార్థులందరూ కలిసి ఈ స్కూల్‌కి ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకొని అందరి అభిప్రాయం ప్రకారం ఈ ప్లాటినం జూబ్లీ భవనం రూ.50 లక్షలతో పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దల సహకారంతో నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 30న ఈ భవనం ప్రారంభోత్సవంలో స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హేని క్రిస్టినా, పలువురు ముఖ్యులు పాల్గొంటారని, గ్రామంలోని ప్రజలు పూర్వ విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరావు, ట్రెజరర్ డాక్టర్ కె.వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు ఆరుదల శంకర్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కొండయ్య, వి.దినేష్ రెడ్డి, మాణిక్యాలరావు, తాతయ్య, రాజమన్నార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడుదాం

విశాలాంధ్ర మాచర్ల : హక్కుల కోసం గిరిజనులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు కొడితే శంకర్ నాయక్ అన్నారు. పట్టణములోని రింగ్ రోడ్డు వైభవ్ రెసిడెన్సీ లో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75ఏళ్లు దాటినా గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయడం లేదన్నారు. నేటికీ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందన్నారు. చట్ట సవరణలకు పాల్పడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాలరాస్తున్నారన్నారు. గిరిజనులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారన్నారు. ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల సమయంలో గిరిజనుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడుతున్నాయంటూ ప్రగల్భాలు పలికే నాయకులు ఆ తర్వాత ఆ దిశలో కనబడటం లేదన్నారు. 12 శాతమున్న గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని, 2026లో జరుగనున్న లో జరుగునున్న నియోజకవర్గం నియోజకవర్గాల పునర విభజనలో జిల్లాలను యూనిట్ గా తీసుకోవాలని ఆయన కోరారు. పాలకులకు కనువిప్పు కలిగేలా విజయవాడలో లక్ష మందితో జరిగే సభను ఏర్పాటుచేసి గిరిజన సత్తా చాటాలని, మహాసభ కై ఇప్పటికే అన్ని నియోజకవర్గాలు తిరిగి గిరిజనులను చైతన్యవంతులను చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అనంతరం వడితే శంకర్ నాయక్ ను ఘనంగా అభినందించారు.కార్యక్రమంలో జెడ్పిటీసీ మల్లుస్వామి, రవి, ఇంపీటీసీ బ్రహ్మయ్య, ఆర్ బ్రహ్మయ్య, కేతావత్ శ్రీను, మంత్రు నాయక్, ఒంగోలు సైదా రాయక్. కొర్రా అంజినాయక్, అచ్చునాయక్, చిన్న శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.